క్లిష్టమైన సర్జరీతో ప్రాణదానం!



3లో

PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

హెల్మెట్ ప్రాణాలకు కవచం



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 94 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- బుధవారం 01 ఏప్రిల్ 2026

## ఏప్రిల్ 2 నుంచి పెద్ద ఎత్తున

# గ్రామసభలు

- సంక్షేమ పథకాలపై ప్రజలకు వివరణ
- అభివృద్ధిపై ప్రజలకు అవగాహన
- డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**హైదరాబాద్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక పై జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు ప్రజా పాలన –ప్రజా ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఏప్రిల్ 2 నుంచి రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న గ్రామసభలను పెద్ద ఎత్తున నిర్వహించాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు. మంగళవారం సాయంత్రం ఆయన ప్రజాభవన్ నుంచి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో చీఫ్ సెక్రటరీ రామకృష్ణారావు, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా తదితరులు పాల్గొన్నారు. గ్రామ సభలు నిర్వహించే క్రమంలో రాష్ట్ర వ్యాప్తంగా ఒకే తరహాలో నిర్వహించేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్లను డిప్యూటీ సీఎం ఆదేశించారు. మొదట ముఖ్యమంత్రి సందేశం వినిపించి ఆ తర్వాత రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పెద్ద ఎత్తున చదివి వినిపించాలని సూచించారు. రైతు భరోసా లబ్దిదారుల పేర్లు, 200 యూనిట్ల విచిత విద్యుత్తు, ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల మిగతా2లో...

## ఆటో సర్వీసులకు

# గ్యాస్ కొరత

- తక్షణమే సమస్య పరిష్కరించండి: కేంద్రమంత్రి హరిదీప్ సింగ్ పూరికి ఉత్తమ్ లేఖ



**హైదరాబాద్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైదరాబాద్‌లో ఎల్‌పీజీ ఆటోరిక్షాలు ఎదుర్కొంటున్న గ్యాస్ కొరతపై కేంద్ర మంత్రి హరిదీప్ సింగ్ పూరికి రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి లేఖ రాశారు. ఆటో కార్మికుల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే అదనపు ఎల్‌పీజీ సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గృహ అవసరాల కోసం డొమెస్టిక్ ఎల్‌పీజీ సరఫరా 100 శాతం కొనసాగించాలని కోరారు. కమర్షియల్ ఎల్‌పీజీ పంపిణీపై కేంద్ర మార్గదర్శకాలు అమలు చేయాలన్నారు. రాష్ట్రంలో ఆటో ఎల్‌పీజీ రంగం తీవ్రంగా ప్రభావితమైందన్నారు. తెలంగాణలో సుమారు 1 లక్ష ఎల్‌పీజీ ఆటోరిక్షాలు రోడ్లపై నడుస్తున్నాయి. ప్రభుత్వ సంస్థల వాటా కేవ లం 20 శాతం మాత్రమే ఉంది. ప్రైవేట్ కంపెనీలు 80 శాతం మార్కెట్‌ను ఆక్రమించాయి. రాష్ట్రవ్యాప్తంగా 110 ప్రైవేట్ ఎల్‌పీజీ ఔట్‌లెట్లు ఉన్నాయి. రోజుకు సుమారు 55 మెట్రిక్ టన్నుల ఆటో ఎల్‌పీజీ కొరత ఏర్పడింది. అనేక ప్రైవేట్ ఔట్‌లెట్లు మిగతా2లో...



## ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

- నేటి కళ్యాణోత్సవానికి సిఎం చంద్రబాబు దంపతుల రాక

**ఒంటిమిట్ట,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఒంటిమిట్టలోని ప్రసిద్ధ కోదండరామ స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి.ఇందులో భాగంగా ఏప్రిల్ 1 బుధవారం రాత్రి ఒంటిమిట్ట సీతారాముల కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుంది. ఈ మహోత్సవానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మిగతా2లో...



- కేరళ ప్రచారం కోసం 30నే అసెంబ్లీ వాయిదా
- కాళేశ్వరంపై కేంద్రమంత్రి వ్యాఖ్యలు సరికావు
- మీడియా సమావేశంలో బిఆర్ఎస్ నేత హరీష్

## అసెంబ్లీలో సమస్యలు చర్చకు

# రాకుండా చేశారు

**హైదరాబాద్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రజా సమస్యలు చర్చకు రాకుండా వివిధ కారణాలతో అసెంబ్లీ సమయాన్ని వృధా చేశారని మాజీ మంత్రి, డిప్యూటీ ఎ÷–లోర్ లీడర్ హరీష్ రావు అన్నారు. అసెంబ్లీని ఇష్టం వచ్చినట్లు నడిపారని.. అసెంబ్లీలో టీ బ్రేక్ అని చెప్పి, ముఖ్యమంత్రి ఢిల్లీ నుండి వస్తున్నాడని ఒకరోజు, కేరళ నుండి వస్తున్నాడని ఒకరోజు.. నాలుగు గంటలు వృధా చేశారన్నారని ఆరోపించారు. మీడియా సమావేశంలో హరీష్ రావు మాట్లాడుతూ.. ఒకరోజు పెండ్లి ఉందని పోతరు, ఒకరోజు ÷నాన్స్ మినిస్టర్ ప్రిపేర్ అవుతున్నాడని అని సభ ఆపేస్తారు. అసలు సభకు వచ్చి ప్రిపేర్ అవుతారా, ప్రిపేర్ అయ్యాక సభకు వస్తారా..? అని హరీష్ రావు ప్రశ్నించారు. ఒకరోజు విద్యుత్ ఉద్యోగులకు చెక్కులు ఇవ్వాలని 4 గంటలు వృధా చేశారని.. మండిపడ్డారు. కేరళ ఎన్నికల కోసం శాసనసభని 30వ తేదీనే బంద్ పెట్టారు. కేరళ ఎన్నికలు మీకు మిగతా2లో...



## చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

- నలుగురు పోలీసులకు గాయాలు

**విజయవాడ,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కృష్ణా జిల్లా చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు సంభవించింది. ఈ ఘటనలో నలుగురు పోలీసులకు తీవ్రగాయాలయ్యాయి. మందుగుండు సామగ్రిని పోలీసులు బయట నుంచి తీసుకొచ్చి పీఎస్‌లో పరిశీలిస్తుండగా ఈ ఘటన చోటుచేసున్నట్లు సమాచారం. గాయపడిన వారిలో ఎస్సైతో పాటు పోలీసు వాహన డ్రైవర్ దుర్గాంజనేయులు, ఇద్దరు కానిస్టేబుళ్లు ఉన్నారు. వీరిని వెంటనే స్థానికంగా ఉన్న ఓ ఆస్పత్రికి తరలించి చికిత్స మిగతా2లో...

## అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

- 31 హామీలతో బిజెపి మేనిఫెస్టో విడుదల




**గౌహతి,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** త్వరలో ఎన్నికలు జరగనున్న అస్సాంలో మంగళవారం బిజెపి సంకల్ప పాత్ర పేరుతో 31 హామీలతో మేనిఫెస్టోను విడుదల చేసింది. ఈ హామీల్లో కీలకంగా ఉమ్మడి పౌరస్మృతి (యుసిసి), మహిళలకు అరుణోదరు పథకం కింద నెలకు మూడువేల రూపాయల్ని నేరుగా తమ బ్యాంకు అకౌంట్లలో జమ చేయడం వంటివి ఉన్నాయి. మేనిఫెస్టో విడుదల సందర్భంగా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ మాట్లాడుతూ.. 'అస్సాంని ప్రకాశవంతమైన రాష్ట్రంగా తీర్చిదిద్దడమే బిజెపి లక్ష్యంగా పెట్టుకుంది' అని ఆయన అన్నారు. ఉత్తరాఖండ్, గుజరాత్ రాష్ట్రాల మాదిరిగానే అస్సాంలో కూడా యుసిసిని అమలు చేయడమే బిజెపి అజెండా మిగతా2లో...

## నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

- 8మంది మహిళా భక్తులు మృత్యువాత



2లో

## కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

ఎల్‌డిఎఫ్‌తో బిజెపి కుమ్మక్కు

అందుకే శబరిమల ఘటనపై మాట్లాడడం లేదు

మరోమారు విమర్శలు గుప్పించిన కాంగ్రెస్ నేత



2లో



## మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

- నేటి నుంచి బంద్ పాటిస్తామని ప్రకటన

**హైదరాబాద్,మార్చి 31(పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణలో నేటి నుంచి చికెన్ దుకాణాలు బంద్ కానున్నాయి. పౌల్ట్రీ కంపెనీలు మార్జిన్‌లు పెంచే వరకు నిరవధిక బంద్ పాటిస్తామని చికెన్ షాప్ ఓనర్స్ అసోసియేషన్ మిగతా2లో...

## ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

- అందచేసిన సిఎం రేవంత్ రెడ్డి



**హైదరాబాద్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ట్యాంక్ బండ్ శివకు ప్రభుత్వం తరపున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సాయం అందించారు. కుటుంబానికి రూ.5 లక్షలు ఆర్థికసాయంతో పాటు అతని కుమారుడు వేణుమాధవ్ కు హోం గార్డు ఉద్యోగ నియామకపత్రం అందజేసారు. ట్యాంక్ బండ్ పై ఎంతో మంది ప్రాణాలను కాపాడిన శివ గురించి ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి చేరింది. ట్యాంక్ బండ్ శివ దీన పరిస్థితిని అర్థం చేసుకున్న సిఎం అతడిని ఆదుకోవడానికి నిర్ణయించారు.ఉపాధి లేక కుటుంబ పోషణ భారమై ఇబ్బందులు పడుతున్న ట్యాంక్ బండ్ శివకు ఆర్థిక సాయం మిగతా2లో...

# ఏప్రిల్ 2 నుంచి పెద్దఎత్తున గ్రామసభలు

(మొదటి పేజీ తరువాయి)

జాబితాను సాధ్యమైనంతవరకు గ్రామ సభలో చదివి వినిపించాలని ఆదేశించారు. ఇప్పటివరకు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు మరియు జూన్ 2 నుంచి అందరికీ జీవిత బీమా అమలు చేయబోతున్న విషయాన్ని వివరించాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఉదయం పూట అల్పాహారం ఆ కార్యక్రమంలో భాగంగా మూడు రోజులపాటు గ్లాస్ పాలు, మూడు రోజులపాటు రాగి జావా అందిస్తున్న విషయాన్ని వివరించాలన్నారు. ఇంటర్ కళాశాలల విద్యార్థులకు కొత్తగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేస్తున్న విషయం అందరికీ తెలిసేలా వివరించాలన్నారు. వీటిని వివరించే క్రమంలో సాంస్కృతిక శాఖ, పౌర సంబంధాల శాఖ సహాయ సహకారాలు తీసుకోవాలన్నారు. గ్రామపంచాయతీలకు పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నాం, గ్రామాల వారిగా విడుదలైన నిధుల వివరాలను అందుబాటులో పెట్టుకుని గ్రామసభ రోజు ఆ గ్రామానికి ఎంత చేరిందో ప్రకటించాలి అన్నారు. ÷–రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం అవుతున్న తీరును ఎప్పటికప్పుడు చీఫ్ సెక్రటరీ మరియు ప్రణాళికా శాఖ జిల్లా కలెక్టర్ ల నుంచి సమాచారం సేకరిస్తారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలకే పరిమితం కాదు మౌలిక సదుపాయాల అభివృద్ధి, సేవా రంగాన్ని అభివృద్ధి చేస్తూ ముందుకు పోతున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు.

# ఆటో సర్వీసులకు గ్యాస్ కొరత

(మొదటి పేజీ తరువాయి)

డ్రై అవుట్ పరిస్థితి నెలకొంది. ప్రజా రవాణాలో అంతరాయం, ప్రజల్లో ఆందోళన కొనసాగుతోంది. ప్రైవేట్ కంపెనీలకు ఖాజల నుంచి సరఫరా అంతరాయం ఏర్పడిందని లేఖలో మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ రంగ ఔట్‌లెట్లలో ఆటో ఎల్‌పీజీ అందుబాటు ఉంచాలని విజ్ఞప్తి చేశార. ప్రైవేట్ కంపెనీలకు తక్షణ సరఫరా కల్పించాలని కేంద్రానికి విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.75, ప్రైవేట్ ఔట్‌లెట్లలో లీటర్‌కు రూ.93 వరకు విక్రయిస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ లేఖలో పేర్కొన్నారు. ధరల పెరుగుదలపై నియంత్రణ చర్యలు అవసరమని.. కేంద్రం తక్షణ జోక్యం వల్ల ప్రజా రవాణా సేవలు నిలకడగా కొనసాగుతాయని స్పష్టం చేశారు.

# అసెంబ్లీలో సమస్యలు చర్చకు రాకుండా చేశారు

(మొదటి పేజీ తరువాయి)

అవసరం ఏమో..? తెలంగాణ ప్రజలకు, బీఆర్ఎస్ పార్టీకి శాసనసభ ముఖ్యం, ప్రజా సమస్యలు ముఖ్యమని హరీష్ రావు స్పష్టం చేశారు. శాసనసభలో పహిల్వాన్లు అని రేవంత్ రెడ్డి అంటాడు, కత్తులతో తలలు తీసేస్తామని ఇంకో సభ్యుడు అంటాడు. మరి ఇవన్నీ ఎథిక్స్ కమిటీకి రిఫర్ చేయరా..? కాంగ్రెస్ సర్కార్‌ను హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్ రెడ్డి ఎన్నోసార్లు అనాగరిక భాష మాట్లాడాడు, మరి అది రిఫర్ చేయరా ఎథిక్స్ కమిటీకి..? అని అడిగారు. మీరు అసెంబ్లీలో మా గొంతు నొక్కే ప్రయత్నం చేసినా, ప్రజాక్షేత్రంలో మిమ్మల్ని నిలదీస్తూనే ఉంటామని హరీష్ రావు హెచ్చరించారు.

రేవంత్ రెడ్డి, సీఆర్ పాటిల్ వ్యాఖ్యలకు మధ్య తేడా లేదని హరీష్ రావు అన్నారు.

కాళేశ్వరం ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వమే అన్ని అనుమతులు ఇచ్చింది. కేంద్ర ప్రభుత్వం, కేంద్ర మంత్రులు, సుప్రీంకోర్టు కూడా కాళేశ్వరం చాలా గొప్ప ప్రాజెక్టు అని ప్రశంసించాయి. నితిన్ గడ్కరీ, పీవీ నరసింహన్ లాంటి ఎందరో ప్రముఖులు కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణాకు వరప్రదాయిని అని అన్నారు.

కేవలం బీఆర్ఎస్ పార్టీ మీద బు రదజల్లడానికే కాళేశ్వరం గురించి తప్పుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఒక్క రూ.50 కోట్లు ఇస్తే ఇంకొక 2 లక్షల ఎకరాల ఆయకట్టు వస్తుందని, రెండేళ్ల నుండి దాదాపు 20 లేఖలు రాస్తున్నా ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పందిస్తలేదని అన్నారు. మీకు మా మీ ద కోపం ఉంటే తీర్చుకోండి.. కానీ ఆ కోపాన్ని రైతుల మీద చూపకండని హరీష్ రావు విజ్ఞప్తి చేశారు.

# ఉచిత బస్సుతో మహిళలకు మేలు

### పదివేల కోట్లు ఆదాచేసిన మహిళలు
### ఆర్టీసీ అభివృద్ధికి అనేక చర్యలు
### మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి

**హైదరాబాద్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ ప్రజా భవన్ వేదికగా మంత్రి పొన్నం ప్రభాకర్ ఆర్టీసీ ప్రగతిపై కీలక ప్రకటన చేశారు. ప్రజా పాలన ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 48 గంటల్లోనే ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యాన్ని కల్పించామని ఆయన గుర్తుచేశారు. డిసెంబర్ 9, 2023న ప్రారంభమైన మహాలక్ష్మి పథకం అద్భుత ఫలితాలను ఇస్తోందని మంత్రి వెల్లడించారు. ఇప్పటివరకు 290 కోట్ల మంది మహిళలు ఉచితంగా ప్రయాణించి.. దాదాపు 10 వేల కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని తెలిపారు. మహిళా ప్రయాణికులను కేవలం ప్రయాణికులుగా మాత్రమే కాకుండా, వారిని ఆర్టీసీకి యజమానులను చేయడమే తమ ప్రభుత్వ లక్ష్యమని అన్నారు.ప్రతిరోజూ 65 లక్షల మంది ప్రయాణికుల్లో 40 లక్షల మంది మహిళలే ఉంటున్నారని.. 97 డిపోల పరిధిలో రోజూ 35 లక్షల కిలోమీటర్లు బస్సులు తిరుగుతున్నాయని మంత్రి పొన్నం తెలిపారు. ఈ భారీ లక్ష్యాన్ని విజయవంతంగా ముందుకు తీసుకెళ్తున్న డ్రైవర్లు, కండక్టర్లకు ఆయన ప్రభుత్వం తరపున ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యంగా రాఖీ వంటి పండుగ దినాల్లోనూ కుటుంబాలకు దూరంగా ఉండి సేవలందించిన కార్మికుల కృషి వెలకట్టలేనిదని కొనియాడారు. ఎలక్ట్రిక్ బస్సుల విషయంలో కొందరు కావాలని తప్పుదోవ పట్టిస్తున్నారని, యూనియన్ల పేరుతో రెచ్చగొట్టే చర్యలను మానుకోవాలని హెచ్చరించారు. తెలంగాణకు ఆర్టీసీయే లైఫ్ లైన్ అని ప్రజల రవాణా అవసరాలను తీర్చడంలో ఆర్టీసీ అగ్రస్థానంలో ఉంటుందని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఆర్టీసీని రాష్ట్రంలోని ప్రతి మూలకు చేర్చేందుకు యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్నామన్నారు. నియోజకవర్గాల వారీగా కొత్త రూట్లు, కొత్త బస్సులు , బస్ స్టేషన్ల అభివృద్ధిపై ప్రజా ప్రతినిధుల నుంచి నివేదికలు తీసుకున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైదరాబాద్‌లో 340 కొత్త రూట్లలో బస్సులను ప్రారంభించామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని సర్వీసులు అందుబాటులోకి వస్తాయని స్పష్టం చేశారు. కార్మికుల సంక్షేమంపై స్పందిస్తూ.. బకాయిలను తీరుస్తున్నామని, యూనియన్ల ఏర్పాటు, ఆర్టీసీ విలీనం అంశాలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయని మంత్రి పొన్నం వెల్లడించారు.



# పసుపు రైతులకు ప్రభుత్వం భరోసా

### తడిసిన పసుపు కొనుగోళ్లకు నిర్ణయం
### మార్కెట్‌యార్డు అధికారులకు మంత్రి తుమ్మల ఆదేశం

**హైదరాబాద్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** పసుపు రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల అన్నారు. తేమ కలిగిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేస్తామన్నారు. మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తేమ శాతం పేరుతో రైతులను ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. రైతులను ఇబ్బంది పెడితే మార్కెట్ అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిజామాబాద్ మార్కెట్‌కు పసుపు భారీగా వస్తోంది. 1,500 టార్పాలిన్ల పంపిణీ కోసం



బిడ్డింగ్ పూర్తి చేశాం. పసుపు కొనుగోళ్లు వేగంగా చేపట్టాలని అధికారులను ఆదేశించాం. మేలు రకం పసుపు పంటకు ప్రభుత్వం ఖరారు చేసిన ధర చెల్లిస్తున్నాం. రైతులకు చెల్లింపులు సక్రమంగా జరగాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశాం అని తుమ్మల పేర్కొన్నారు. మంగళవారం నాడు మీడియాతో మాట్లాడిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు..పసుపు రైతులకు ఊరటనిస్తూ కీలక ఆదేశాలు జారీ చేశారు. అకాల వర్షాలతో పసుపు పంట నష్టపోయిన రైతులకు ప్రభుత్వం పూర్తి అండగా ఉంటుందని చెప్పారు. తడిసిన పసుపును కోతలు లేకుండా కొనుగోలు చేయాలని మంత్రి తుమ్మల ఆదేశించారు. తేమ పేరుతో రైతులను ఇబ్బంది పెట్టొద్దని అధికారులను హెచ్చరించారు. మార్కెట్ యార్డు అధికారులు రైతులను ఇబ్బంది పెడితే.. కఠిన చర్యలు తీసుకుంటామంటూ మంత్రి తుమ్మల వార్నింగ్ ఇచ్చారు. . నిజామాబాద్ మార్కెట్‌కు భారీగా పసుపు వచ్చిందన్నారు. 4,500 కుప్పలు (27,400 బస్తాలు) యార్డుకు చేరిందన్నారు. 500 కుప్పలు బహిరంగ ప్రదేశాల్లో నిల్వ ఉందని చెప్పిన మంత్రి.. పసుపు రక్షణకు 1,500 టార్పాలిన్‌లు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.

# కేరళలో రాహుల్ ఉధృత ప్రచారం

**తిరువనంతపురం,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** కేరళ అసెంబ్లీ ఎన్నికల్లో రాహుల్ ప్రచారం ఉధృతం చేశారు. వరుసగా రెండోరోజు ఆయన వివిధ ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. అయితే అధికార అధికార లెఫ్ట్ డెమొక్రటిక్ ఫ్రంట్, బీజేపీపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శలు గుప్పించారు. సిద్ధాంతాలకు వ్యతిరేకంగా బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టిందని ఆరోపించారు. అందువల్లే ఈ ఎన్నికల్లో ఎల్డీఎఫ్ గెలవాలని మోదీ కోరుకుంటున్నారని అన్నారు. బీజేపీతో కూడిన ఎల్డీఎఫ్‌కు, కాంగ్రెస్ సారథ్యంలోని యూడీఎఫ్‌కు మధ్యే ఎన్నికల పోరాటం జరుగుతోందన్నారు. కన్నూరులో మంగళవారంనాడు జరిగిన ఎన్నికల ప్రచార సభలో రాహుల్ మాట్లాడారు. స్వతంత్ర అభ్యర్థులుగా పోటీచేస్తున్న సీపీఎం మాజీ నేతలు వి.కున్హికృష్ణన్, టీవీ గోవిందన్‌లు కూడా రాహుల్ ప్రసంగించిన వేదికపై పాల్గొన్నారు. ఈ ఎన్నికలు రెండు సిద్ధాంతాలకు మధ్య జరుగుతున్న పోరని, తొలిసారి బీజేపీ–లెఫ్ట్ ఫ్రంట్ చేతులు కలపడం అంతా చూస్తున్నామని రాహుల్ అన్నారు. బీజేపీతో ఎల్డీఎఫ్ జత కట్టడం ఇష్టంలేకనే ఆ పార్టీలోని కొందరు సీనియర్లు యూడీఎఫ్ మద్దతుతో స్వతంత్ర అభ్యర్థులుగా పోటీ చేస్తున్నారని చెప్పారు. లెఫ్ట్ ఫ్రంట్ ఇంకెంతమాత్రం వామపక్ష పార్టీ కాదని, అతివాద రైట్‌వింగ్ పార్టీ అని పేర్కొన్నారు. ప్రధానమంత్రి ఎక్కడకు వెళ్లినా ఆలయాలు, మతం గురించి మాట్లాడతారని.. కానీ ఇక్కడకు వచ్చినప్పుడు మాత్రం శబరిమల ఆలయంలో బంగారం తాపడాలు మాయం కావడంపై ఎందుకు మాట్లాడటం లేదని రాహుల్ ప్రశ్నించారు. రాష్ట్రంలో లెఫ్ట్ ఫ్రంట్ తిరిగి గెలవాలని ఆయన కోరుకుంటున్నారని చెప్పడానికి ఇంతకంటే నిదర్శనం లేదని అన్నారు. సీపీఎంను బీజేపీ కంట్రోల్ చేస్తోందని, యూడీఎఫ్‌ను మాత్రం కాదని చెప్పారు. తనకు సవాల్ విసరగలిగే సత్తా కాంగ్రెస్‌కు మాత్రమే ఉందనే విషయం మోదీకి బాగా తెలుసునని అన్నారు. మోదీని కాంగ్రెస్ ప్రతిఘటించడం అందరికీ తెలుసునని, కానీ మోదీని కేరళ సీఎం కానీ, కేరళ సీఎంను మోదీ కానీ విమర్శించడం ఎవరూ విని ఉండరని రాహుల్ అన్నారు.

# ఒంటిమిట్టలో వైభవంగా బ్రహ్మోత్సవాలు

(మొదటి పేజీ తరువాయి)

దంపతులు హాజరవుతారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున స్వామి వారికి పట్టువస్త్రాలు, ముత్యాల తలంబ్రాలను సీఎం దంపతులు సమర్పించనున్నారు. కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించేందుకు ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం, పుర వీధులు రంగురంగుల దీపాలు, ప్రకాశవంతమైన ప్రదర్శన బోర్డులతో అలంకరించారు. భక్తుల సౌకర్యార్థం తగిన ఏర్పాట్లు చేయడంతో పాటు, పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేశారు. మార్చి 26న అంకురార్పణతో ప్రారంభమైన ఈ ఉత్సవాలు ఏప్రిల్ 5 వరకు వైభవంగా జరగనున్నాయి. బ్రహ్మోత్సవాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శనం చేసుకుంటున్నారు. మంగళవారం ఉదయం మోహిని అలంకారంలో కోదండరాముడు భక్తులకు దర్శనమిస్తున్నాడు. ఇవాళ రాత్రి గరుడ వాహనంపై ఒంటిమిట్ట పురవీధుల్లో స్వామి వారి ఊరేగింపు నిర్వహించనున్నారు.

# చల్లపల్లి పోలీస్‌స్టేషన్‌లో పేలుడు

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నారు. పేలుడు ధాటికి పీఎస్‌లోని ఫర్నిచర్, బయట నిలిపి ఉంచిన వాహనాలు దెబ్బతిన్నాయి. చల్లపల్లి సీఐ కేవీఎస్ రావు ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. పేలుడుకు గల కారణాలపై ఆరా తీస్తున్నారు. పీఎస్‌లో పేలుడు ఘటనపై రాష్ట్ర హోంమంత్రి అనిత స్పందించారు. జిల్లా ఎస్పీతో ఆమె మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. గాయాలపాలైన పోలీసులకు మెరుగైన వైద్యం అందించాలని అనిత ఆదేశించారు.

# అసోంలో మహిళలకు మూడువేల తాయిలం

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. అలాగే లవ్ జీహాద్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటాం అని ఆయన అన్నారు. యుసిసిని రాజ్యాంగంలోని ఆరవ షెడ్యూల పరిధిలోకి వచ్చే ప్రాంతాల నుంచి మినహాయిస్తామని, గిరిజన వర్గాల్లో దీని అమలు చేయమని ఆయన అన్నారు. రద రహిత అస్సాంను మార్చేందుకు రాబోయే రెండేళ్లలో 18 వేల కోట్లను ఖర్చు చేస్తాం. లక్షపతి దీదీ పథకం కింద 40 లక్షల మంది మహిళలకు 25 వేల రూపాయలు అందిస్తాం. వచ్చే ఐదేళ్లలో రెండు లక్షల జాబ్‌లు ఇస్తాం. ఒక జిల్లా, ఒక కళాశాల, ఒక విశ్వవిద్యాలయం, ఒక ఇంజనీరింగ్ కళాశాలను ఏర్పాటు చేస్తాం. అరుణోదరు పథకం కింద ఇస్తున్న రూ. 1250లను పెంచి మహిళలకు 3,000లు అందించడానికి ప్రయత్నిస్తాం అని హిమంతబిశ్వ శర్మ అన్నారు. మేనిఫెస్టో విడుదల కార్యక్రమంలో సిఎం హిమంత బిశ్వ శర్మ, కేంద్ర మంత్రులు నిర్మలా సీతారామన్, సర్బానంద సోనోవాల్, ఆ రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు దిలీప్ సైకియా హాజరయ్యారు.ం

# నలంద ఆలయంలో వద్ద తొక్కిసలాట

**పాట్నా,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** బీహార్‌లోని నలందలో ఘోర ప్రమాదం చోటు చేసుకుంది. నలందలో ఒక ఆలయం వద్ద తొక్కిసలాట జరిగింది. నలంద జిల్లాలోని శీతలా మాత ఆలయంలో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో ఎనిమిది మంది మృతి చెందారు. అందరూ మహిళలే కావడం గమనార్హం.ఈ ఘటనలో మరో 12 మందికి పైగా గాయపడ్డారు. అధిక సంఖ్యలో భక్తులు తరలిరావడంతో ఈ తొక్కిసలాట చోటు చేసుకుంది. నలంద జిల్లాలోని బీహార్ షరీఫ్‌కు దాదాపు ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న మఘ్రా గ్రామంలోని శీతలాష్టమి ఆలయం వద్ద ఈ తొక్కిసలాట జరిగింది. చైత్ర మాసంలోని చివరి మంగళవారం కావడంతో, ఆలయానికి భారీ సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. అధిక సంఖ్యలో మహిళలు మంగళవారం నాడు ఈ గుడికి వస్తుంటారు. నిర్వహణ లోపం కారణంగానే ఈ తొక్కిసలాట జరిగిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. పదుల సంఖ్యలో మహిళలు స్పృహ తప్పిపోడిపోయిన దృశ్యాలు కలవరపెడుతున్నాయి. బాగా రద్దీగా ఉండడంతో అంబులెన్స్‌లు కూడా అక్కడకు చేరుకోవడం ఇబ్బందిగా మారింది. గాయపడిన వారికి స్థానికులు సపర్యలు చేస్తున్నారు. చేతులతో ఎత్తుకుని అంబులెన్స్‌ల వద్దకు తీసుకెళ్తున్నారు.

# మార్జిన్ కోసం చికెన్ దుకాణాదారుల ఆందోళన

(మొదటి పేజీ తరువాయి)

హెచ్చరించింది. గతంలో కంటే మార్జిన్ ఇప్పుడు తక్కువగా ఇస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. గతంలో పౌల్ట్రీ వాళ్లు రిటైల్ దుకాణాలకు కిలోకు రూ.26 మార్జిన్ ఇచ్చేవారని, గత ఇరవై ఏళ్లుగా ఇదే మార్జిన్ ఇస్తున్నారని, ఇటీవల ఈ మార్జిన్ రూ.16 కు తగ్గించారని దుకాణ యజమానులు ఆందోళన వ్యక్తంచేశారు.కేజీ చికెన్ మార్జిన్ రూ.30 ఇవ్వాలని ఓనర్స్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. అందుకే మార్జిన్ పెంచే వరకు రేపటి నుంచి నిరవధిక బంద్‌కు పిలుపునిస్తున్నట్లు తెలిపింది. ప్రస్తుతం చికెన్ విక్రయాలపై వస్తున్న లాభాలు తక్కువగా ఉండటంతో షాపులు నిర్వహించడం కష్టంగా మారినట్లు అసోసియేషన్ నాయకులు చెబుతున్నారు. తక్కువ మార్జిన్ వల్ల వ్యాపారుల జీవనోపాధి సవాల్‌గా మారిందని అంటున్నారు. తమ సమస్యలు పరిష్కారమయ్యే వరకు నిరసన కొనసాగుతుందని తెలిపారు.

# ట్యాంక్ బండ్ శివకు 5లక్షల ఆర్థిక సాయం

(మొదటి పేజీ తరువాయి)

అందించాలని నిర్ణయించారు. ట్యాంక్ బండ్ శివకు అవసరమైన సాయం అందించాలని కొద్ది రోజుల క్రితం అధికారులను ఆదేశించారు. ఉపాధి కోసం ట్యాంక్ బండ్ సమీపంలో ఒక స్విమ్మింగ్ పూల్ నిర్మించి ఇవ్వాలని ట్యాంక్ బండ్ శివ కోరారున ఆ దిశగా చర్యలు తీసుకోవాలని అధికారులను సిఎం ఆదేశించారు. శివ కుటుంబానికి డబుల్ బెడ్రూం ఇల్లు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. సీఎం చేతులమీదుగా సాయం అందుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేసిన ట్యాంక్ బండ్ శివ, కుటుంబసభ్యులు.

# మాకు సాయం చేయలేదుగా.. ఇక మీ క్రూడ్ ఆయిల్‌ను మీరే తెచ్చుకోండి: ట్రంప్

**ఇరాన్, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :**ఇరాన్‌పై దాడుల్లో తమకు సహకరించని దేశాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తాజాగా తన అసంతృప్తిని వెళ్ళగక్కారు. యూఎస్‌కు సహకరించని దేశాలు హోర్ముజ్ జలసంధికి వెళ్లి ముడి చమురును తెచ్చుకోవాలని అన్నారు. అది కుదరకపోతే అమెరికా నుంచి ముడి చమురును కొనుగోలు చేయాలని సూచించారు. ఈ మేరకు సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ఆయన పోస్టు పెట్టారు.‘ఇరాన్ విషయంలో యూఎస్‌కు సాయం చేయక చివరకు హోర్ముజ్ జలసంధి నుంచి చమురును తెచ్చుకోలేకపోతున్న బ్రిటన్ వంటి దేశాలకు నేను ఒక సూచన చేస్తున్నాను. మీకు రెండు మార్గాలు ఉన్నాయి. ఒకటి యూఎస్ నుంచి ముడి చమురును కొనుగోలు చేయాలి. మా వద్ద అది సమృద్ధిగా ఉంది. రెండోది కాస్త ధైర్యాన్ని కూడగట్టుకుని హోర్ముజ్‌కు వెళ్లి చమురును తెచ్చుకోవాలి. మీ కోసం మీరు పోరాడటాన్ని ఇకపై మీరు నేర్చుకోవాలి. యూఎస్ మీకు ఎల్లప్పుడూ సాయంగా వస్తుందని అనుకోవద్దు. మీరూ మాకు సహాయం చేయలేదన్న విషయాన్ని మర్చిపోవద్దు. ఇరాన్ దాదాపుగా తుడిచిపెట్టుకుపోయింది. కష్టమైన ఈ పనిని మేము పూర్తి చేశాము. ఇక మీ ముడి చమురును మీరే వెళ్లి తెచ్చుకోండి’ అని ట్రంప్ పోస్టు పెట్టారు.గల్ఫ్ ఉద్రిక్తతలు మొదలై నెల రోజులు దాటిపోయినా ఇరాన్ ఇప్పటికీ హోర్ముజ్‌పై తన పట్టును సడలించని విషయం తెలిసిందే. ఈ జలసంధి మీదుగా చమురు రవాణాకు ఆటంకాలు ఏర్పడటంతో అంతర్జాతీయ మార్కెట్స్‌లో ముడి చమురు ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రతికూల ప్రభావం తప్పదన్న ఆందోళన వ్యక్తం అవుతోంది.

# క్లిష్టమైన సర్జరీతో ప్రాణదానం!

### పగిలిన మెదడు రక్తనాళం ప్రాణాలు నిలిపిన యశోద హాస్పిటల్ వైద్యుల అద్భుతం

### కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, డాక్టర్ వంశీ రెడ్డి బృందం వివరాలు వెల్లడి




**హనుమకొండ, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక రోగికి మలక్‌పేట యశోద హాస్పిటల్ వైద్యులు పునర్జన్మ ప్రసాదించారు. అత్యంత సంక్లిష్టమైన 'బ్రెయిన్ అన్యూరిజం' (మెదడులోని రక్తనాళం ఉబ్బి పగిలిపోవడం) సమస్యతో వచ్చిన 49 ఏళ్ల వ్యక్తికి అత్యవసరంగా ఓపెన్ బ్రెయిన్ సర్జరీ నిర్వహించి ప్రాణాలను కాపాడమని కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, డాక్టర్ వంశీ రెడ్డి బృందం తెలిపారు. మంగళవారం రోజున హనుమకొండ ప్రెస్ క్లబ్ లో విలేకరులతో మాట్లాడుతూ గత ఏడాది డిసెంబర్ 5న, సదరు బాధితుడు తీవ్రమైన తలనొప్పితో ఆసుపత్రిలో చేరారు. వైద్యులు వెంటనే సిటీ స్కాన్ నిర్వహించగా, మెదడులో తీవ్ర రక్తస్రావం జరిగినట్లు గుర్తించారు. ప్రధాన రక్తనాళంపై ఉన్న అన్యూరిజం పగిలిపోవడమే దీనికి కారణమని నిర్ధారించారు. అన్యూరిజం నిర్మాణం చాలా క్లిష్టంగా ఉండటంతో, సాధారణంగా చేసే 'కాయిలింగ్' లేదా 'స్టెంట్' పద్ధతులు ఈ కేసులో పని చేయవని వైద్యులు గుర్తించారు. దీనితో కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ జయానంద్ సుధీర్, డాక్టర్ వంశీ రెడ్డి బృందం తక్షణమే 'ఓపెన్ బ్రెయిన్ మైక్రో సర్జికల్ క్లిప్పింగ్' చేయాలని నిర్ణయించారు. తల భాగాన్ని తెరిచి మెదడులో పేరుకుపోయిన రక్తస్రావాన్ని అదుపు చేశారు. పగిలిన రక్తనాళం యొక్క బలహీనమైన భాగాన్ని మైక్రోస్కోపిక్ పద్ధతిలో చిన్న టైటానియం క్లిప్‌తో మూసివేశారు. కీలకమైన ఇతర రక్తనాళాలకు ఎటువంటి నష్టం కలగకుండా రక్త ప్రసరణను పునరుద్ధరించారు. "ఆకస్మికంగా వచ్చే తీవ్రమైన తలనొప్పిని కేవలం సాధారణ సమస్యగా భావించి నిర్లక్ష్యం చేయవద్దు. ఈ కేసులో రోగిని సకాలంలో ఆసుపత్రికి చేర్చడం వల్లే మేము కాపాడగలిగాము" అని డాక్టర్ జయానంద్ సుధీర్ తెలిపారు. శస్త్రచికిత్స అనంతరం రోగి ఎటువంటి శారీరక ఇబ్బందులు లేకుండా కేవలం 5 రోజుల్లోనే (డిసెంబర్ 13న) డిశ్చార్జ్ అయ్యారు. యశోద హాస్పిటల్ డైరెక్టర్ గోరుకంటి పవన్, యూనిట్ హెడ్ కె. శ్రీనివాసరెడ్డి, ఏవీపీ శ్రీనివాస్ చిదుర వైద్య బృందాన్ని అభినందించారు. అత్యాధునిక న్యూరో సర్జరీ వసతులు, 24/7 అందుబాటులో ఉండే నిపుణులైన క్రిటికల్ కేర్ టీమ్ వల్లే ఇలాంటి అసాధ్యమైన కేసులను సుసాధ్యం చేస్తున్నామని వారు పేర్కొన్నారు.

# హెల్మెట్ ప్రాణాలకు కవచం



### రోడ్డు భద్రతపై పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు

### హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరి అంటున్న పోలీసులు

**కల్లూరు, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఖమ్మం జిల్లా కల్లూరులో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్ సేఫ్టీ అవేర్నెస్ కార్యక్రమం ప్రజల్లో విశేష స్పందనను రేకెత్తించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రణాళికలో భాగంగా ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించడం పోలీస్ శాఖ కృషిని ప్రతిబింబించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఏసీపీ వసుంధర యాదవ్ మెయిన్ రోడ్డు పై నున్న పరిస్థితులను ట్రాఫిక్ సంబంధించిన ఇబ్బందులను ఆమె స్వయంగా పరిశీలించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. రోడ్డుపై చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే వారు క్రమేపి ఫుట్ పాత్ ను దాటి రోడ్డును ఆనుకొని వారు ఉండటం వల్ల వెనుక నుంచి వాహనాలు వస్తున్నప్పుడు తప్పించుకునే పరిస్థితి లేక ప్రమాదాలు జరిగే అవకాశం ఎక్కువగా ఉందని ఏసిపి దృష్టికి తీసుకెళ్లడంతో చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపాలిటీ పాలకవర్గం, పోలీస్ శాఖతో కలిసి ట్రాఫిక్ ఇబ్బంది కలగకుండా పునపరిశీలన చేయాలని సీఐ ముత్తు లింగయ్య కు, ఎస్ఐ హరితకు తెలియజేశారు. ఈ సందర్భంగా ప్రజలకు రోడ్డు భద్రతపై విలువైన సూచనలు తెలియజేస్తూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని కల్లూరు ఏసిపి వసుంధర యాదవ్ స్పష్టంగా పేర్కొన్నారు. హెల్మెట్ ప్రాణాలను కాపాడే రక్షణ కవచమని, ప్రమాద సమయంలో అది ప్రాణాలను నిలబెట్టే ముఖ్యమైన సాధనమని వివరించారు. వాహనాలు నడిపేటప్పుడు వేగ నియంత్రణ పాటించడం ఎంతో ముఖ్యమని ఆమె తెలిపారు. అధిక వేగం అనర్థాలకు దారి తీస్తుందని హెచ్చరించారు. అలాగే మద్యం సేవించి వాహనం నడపడం అత్యంత ప్రమాదకరమని, అలాంటి చర్యలు కఠినంగా శిక్షార్హమని స్పష్టం చేశారు. బహిరంగ ప్రదేశాలలో మద్యం సేవించడం నేరమని, ఇతరులకు ఇబ్బంది కలగకుండా చూడాలని కోరారు. కార్లలో ప్రయాణించే వారు తప్పనిసరిగా సీటు బెల్ట్ ధరించాలని సూచించారు. ప్రజల ప్రాణ భద్రతే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని ఆమె పేర్కొన్నారు. పోలీస్ శాఖ కేవలం చట్టాన్ని అమలు చేసే సంస్థ మాత్రమే కాకుండా,



ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతాయుత సంస్థగా పనిచేస్తోందని ఈ కార్యక్రమం ద్వారా స్పష్టమైంది. ఇలాంటి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ప్రజల్లో చైతన్యం పెంచడమే కాకుండా, ప్రమాదాల సంఖ్యను గణనీయంగా తగ్గించే దిశగా పోలీసులు కృషి చేస్తున్నారు. ముఖ్యంగా గ్రామీణ మరియు పట్టణ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టడం అభినందనీయ విషయం. మొత్తానికి కల్లూరులో నిర్వహించిన ఈ రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం ప్రజలకు ఒక హెచ్చరికగా, ఒక మార్గదర్శకంగా నిలిచింది. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను పాటించి, తమ ప్రాణాలను కాపాడుకోవడం ద్వారా సమాజాన్ని ప్రమాద రహితంగా మార్చేందుకు సహకరించాల్సిన అవసరం ఉందని పోలీసులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కల్లూరు సిఐ ముత్తిలింగయ్య, ఎస్సై హరిత, మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, విద్యుత్ శాఖ ఏఈ మహేంద్ర బాబు, ఎన్‌హెచ్‌ఏ అధికారులు, మున్సిపల్ మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరావు, 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, మాజీ ఏఎంసీ డైరెక్టర్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దబోయిన శ్రీనివాసరావు, శీలం కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, నోటి కృష్ణారెడ్డి, కర్ణాటి అప్పిరెడ్డి, పోట్రూ అర్జున్ రావు, బైర్ల కాంతారావు, ధరావత్ రవికుమార్, గూగులోతు ప్రసాద్, ఆళ్లకుంట నరసింహారావు, కుంచాల గురవయ్య, స్థానిక నాయకులు, పోలీస్ సిబ్బంది అధికారులు పాల్గొన్నారు.

# కల్లూరు తహసిల్దార్‌కు ఘన స్వాగతం

### రైతుల సమస్యలపై వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి

### ధాన్యం కొనుగోలు కేంద్రాలు తక్షణమే ప్రారంభించాలి

### ఏఎంసి మాజీ డైరెక్టర్ సీనియర్ కాంగ్రెస్ నాయకులు పెద్ద బోయిన శ్రీనివాసరావు



**కల్లూరు, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** నూతనంగా విధుల్లో చేరిన కల్లూరు మండల తహసిల్దార్ కె. బ్రహ్మేశ్వరరావును కాంగ్రెస్ శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా స్థానిక నాయకులు ఆయనకు స్వీట్లు పెట్టి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ మాజీ డైరెక్టర్ కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దబోయిన శ్రీనివాసరావు మాట్లాడుతూ మండలంలో వరి కోతలు ప్రారంభమై ఇప్పటికే 15 రోజులు గడిచాయని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని అమ్మేందుకు సరైన సదుపాయాలు లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే ధాన్యం కొనుగోలు కేంద్రాలు, ముఖ్యంగా ఐకెపి సెంటర్లను ప్రారంభించాలని తహసిల్దార్‌ను కోరారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో ఆలస్యం జరిగితే రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఈ పరిస్థితుల్లో దళారులు రైతులపై ఆధిపత్యం చెలాయించే అవకాశముందని, రైతులు నష్టపోకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా తహసిల్దార్ కె. బ్రహ్మేశ్వరరావు సానుకూలంగా స్పందిస్తూ ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటు విషయంలో జాయింట్ కలెక్టర్ నుంచి ఇప్పటికే మార్గదర్శకాలు అందాయని తెలిపారు. త్వరలోనే కేంద్రాలను ప్రారంభించి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. మొత్తానికి, కొత్తగా బాధ్యతలు చేపట్టిన తహసిల్దార్‌కు స్వాగతం పలుకుతూ రైతుల సమస్యలను ఆయన దృష్టికి తీసుకువెళ్లడం స్థానిక నాయకుల బాధ్యతాయుత వైఖరిని ప్రతిబింబించింది. రైతుల ప్రయోజనాల దృష్ట్యా అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని ప్రజలు ఆశిస్తున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పోట్రు అర్జున్ రావు, పెద్ద బోయిన శీను, వాడేపల్లి లాలు, రాజబోయిన శీను, తోట సుబ్బారావు లు పాల్గొన్నారు.

# ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు

● గృహప్రవేశ కార్యక్రమంలో మున్సిపాల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్





**కల్లూరు, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ప్రతి పేదవానికి ఇందిరమ్మ ఇల్లు ఇవ్వడమే లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్ అన్నారు. కల్లూరు మున్సిపల్ పరిధిలోని 8 వార్డ్ కిష్టయ్య బంజర్ గ్రామంలో పసుపులేటి వెంకటేశ్వరావు నాగమణి కుమారుడు పసుపులేటి రామకృష్ణ, నాగస్వప్న ఏర్పాటు చేసుకున్న ఇందిరమ్మ ఇల్లు గృహప్రవేశ కార్యక్రమంలో చైర్మన్ మోహన్ నాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మేము గత పది సంవత్సరాల నుశీడి పూరిగుడిసెలో జీవనం సాగిస్తున్నామని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాఘమయి దయానంద్ ఆదేశాలతో మాకు ఇందిరమ్మ ఇల్లు ఇచ్చినారని వారికి మా కుటుంబం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బాగశీ నీరజ ప్రభాకర్ చౌదరి, మాజీ సర్పంచ్ లక్కినేని కృష్ణ, బైర్ల కాంతారావు, యువ నాయకులు ఆళ్లకుంట నరసింహారావు, 16 వార్డు కౌన్సిలర్లు ఉబ్బన రాంబాబు, శీలం కృష్ణారెడ్డి, యాస శ్రీకాంత్, పొన్నూరు వెంకటేశ్వరరావు, బైర్ల కాంతారావు, ఏఎంసి మాజి డైరెక్టర్ కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్ద బోయిన శ్రీనివాసరావు, దుర్గా ప్రసాద్, లక్ష్మణరావు, కుటుంబ సభ్యులు పసుపులేటి శ్రీనివాసరావు, శ్రీలక్ష్మి దంపతులు, శివకృష్ణ, హరికృష్ణ దంపతులు పలువురు పాల్గొన్నారు.

## పౌర హక్కులపై అవగాహన సదస్సు... వివక్షపై కఠిన చర్యలు



**కల్లూరు, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** మండల పరిధిలో చంద్రుపట్ల గ్రామంలో తెలంగాణ ప్రభుత్వ షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ద్వారా ఎంపీడీవో చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పౌర హక్కుల అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ షెడ్యూల్ కులాలపై ఎవరైనా చిన్నచూపు చూపుతూ, అవమానకరంగా ప్రవర్తించినా లేదా తక్కువగా మాట్లాడినా, వారిపై చట్టపరమైన కఠిన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రజలు తమ హక్కుల గురించి పూర్తిగా తెలుసుకోవాలని, ఎటువంటి వివక్ష లేదా అన్యాయం జరిగినా వెంటనే మండల అధికారులను సంప్రదించాలని సూచించారు. సమానత్వం, సామాజిక న్యాయం ప్రతి ఒక్కరి హక్కు అని, దానిని కాపాడడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. గ్రామస్థులు పెద్ద ఎత్తున హాజరై, తమ సమస్యలు వెల్లడించారు. ఇలాంటి అవగాహన సదస్సులు సమాజంలో సమానత్వ భావన పెంపొందించడానికి దోహదపడతాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ బ్రహ్మేశ్వరరావు, ఎంపీడీవో చంద్రశేఖర్, గ్రామ సర్పంచ్ కాటమనేని విజయలక్ష్మి వెంకటేశ్వరరావు, ఉప సర్పంచ్ పైళ్ళ రాధాకృష్ణ, అధికారులు, గ్రామ పెద్దలు, నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

## పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహ పునః ప్రతిష్ఠకు బల్దియాలో బడ్జెట్ కేటాయిస్తారని ఆశించాం

### జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్



**కరీంనగర్ టౌన్ మార్చి 31(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని సవరన్ స్ట్రీట్, నెహ్రూ చౌక్ వద్ద స్మార్ట్ సిటీ పనుల సమయంలో తొలగించబడిన భారత తొలి ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠించడం మునిసిపల్ బల్దియాకు ఉన్న బాధ్యత అని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు మల్యాల సుజిత్ కుమార్ పేర్కొన్నారు. సుమారు ఐదేళ్ల క్రితం మునిసిపల్ అధికారులు స్మార్ట్ సిటీ పనుల పేరుతో విగ్రహాన్ని తొలగించినప్పటికీ, ఇప్పటి వరకు పునః ప్రతిష్ఠ చేపట్టకపోవడం దురదృష్టకరమని ఆయన విమర్శించారు. ఈ విషయంపై మునిసిపల్ కమిషనర్, జిల్లా కలెక్టర్‌కు పలుమార్లు విన్నవించుకున్నప్పటికీ స్పందన లభించలేదని తెలిపారు. గత మేయర్‌పై కూడా బల్దియా ముందు ఒత్తిడి కార్యక్రమాలు చేపట్టినా ఫలితం రాలేదని, ఇప్పుడు అయినా బడ్జెట్ కేటాయించి నెహ్రూ గారి విగ్రహాన్ని అదే ప్రదేశంలో పునః ప్రతిష్ఠించాలని సుజిత్ కుమార్ డిమాండ్ చేశారు.

## మహాలక్ష్మి పథకంతో ఆర్టీసీకి 10000 కోట్ల రూపాయల ఆదాయం

● తొర్రూరు టీజీఎస్ ఆర్టీసీ బస్టాండ్ ఏర్పాటుచేసిన సమావేశం




**తొర్రూరు ప్రతినిధి,మార్చి 31(పిసిడబ్ల్యూ న్యూస్):** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా మహాలక్ష్మి పథకంలో భాగంగా స్థానిక టీ జి ఎస్ ఆర్ టి సి తొర్రూర్ బస్టాండ్ ఆవరణంలో డిపో మేనేజర్ పద్మావతి అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమం. ఇందులో ముఖ్య అతిథిగా తొర్రూర్ మండల వీజూా బుచ్చయ్య విచ్చేసి మాట్లాడుతూ మహాలక్ష్మి పథకంలో భాగంగా మహిళలు 290 కోట్ల ఉచిత ప్రయాణాలు చేసి 10,000 కోట్ల రూపాయలు మిగిల్చుకున్నారని అన్నారు. ఈ మహాలక్ష్మి పథకం లో భాగంగా మహిళ మనులు వివిధ దేవస్థానాలకు తీర్థయాత్రలకు,, వారి యొక్క అవసరాలకు వివిధ ప్రదేశాలకు ఆర్టీసీ బస్సులో ప్రయాణం చేసి టికెట్ డబ్బులు ఆదా చేసుకుంటున్నారన్నా రని అన్నారు. డిఎం పద్మావతి బస్టాండ్ అవరనం లో ప్రయాణికులతో మాట్లాడి వారి యొక్క సలహాలు సూచనలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ టి ఐ రజిత రెడ్డి, స్టేషన్ మేనేజర్ మల్లికార్జున్ లతోపాటు ఏ డి సి లు, ప్రయాణికులు తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వానికి, సోదరభావానికి ఇస్లాం నిదర్శనం: కరీంనగర్ ఆర్డీవో మహేశ్వర్.

**- ముకర్రంపురలో జమాతే ఇస్లామీ హింద్ ఆధ్వర్యంలో ఘనంగా 'ఈద్ మిలాప్'..**

**- ముస్లింల క్రమశిక్షణ, జకాత్ వ్యవస్థ అద్భుతం.**

**- మత సామరస్యానికి వేదికగా నిలిచిన కార్యక్రమం..**





**కరీంనగర్,మార్చి31(పీసీడబ్ల్యూ న్యూస్):** ఇస్లాం మతం కేవలం ఒక వర్గానికి పరిమితం కాదని, అది సమస్త మానవాళికి మానవత్వాన్ని, సోదరభావాన్ని మరియు క్రమశిక్షణను బోధిస్తుందని కరీంనగర్ ఆర్డీవో (=ఖూ) ఎం. మహేశ్వర్ కొనియాడారు. కరీంనగర్‌లోని ముకర్రంపురలో జమాతే ఇస్లామీ హింద్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఈద్ మిలాప్' కార్యక్రమం మత సామరస్యానికి ప్రతీకగా నిలిచింది. మహ్మద్ అబ్దుల్ హై షుయబ్ లతీఫీ అధ్యక్షతన జరిగిన ఈ వేడుకలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, రిటైర్డ్ అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.**ఆకలి విలువ తెలిసేలా రంజాన్ ఉపవాసాలు**ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ, ఇస్లాంలోని 'జకాత్' (దానధర్మాల) వ్యవస్థ సమాజంలోని పేదరికాన్ని నిర్మూలించడానికి ఒక అద్భుతమైన మార్గమని పేర్కొన్నారు. రంజాన్ ఉపవాసాల గురించి ప్రస్తావిస్తూ.. "సాధారణంగా ఏ మనిషైనా కొన్ని గంటల పాటు ఆకలిని భరించడం కష్టం. కానీ ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠినమైన ఉపవాస దీక్షలు చేస్తూ, ఆకలి విలువను తెలుసుకోవడం, ఆధ్యాత్మిక చింతనలో గడపడం చాలా గొప్ప విషయం" అని అభినందించారు.**ఖురాన్ సందేశం అందరికీ చేరాలి**మరో ముఖ్య అతిథి, TRTF రాష్ట్ర అధ్యక్షుడు కట్కం రమేష్ మాట్లాడుతూ.. జమాతే ఇస్లామీ హింద్ నిర్వహిస్తున్న ఇఫ్తార్ మరియు ఈద్ మిలాప్ కార్యక్రమాలు ఇతర మతస్థులకు ఇస్లాం పట్ల ఉన్న అపోహలను తొలగిస్తున్నాయని అన్నారు. "ఈ సంస్థ ద్వారా నాకు పవిత్ర ఖురాన్ గ్రంథం లభించింది. మసీదును సందర్శించినప్పుడు అక్కడ కనిపించే క్రమశిక్షణ, ఆరాధన పద్ధతులు నన్ను ఎంతో ప్రభావితం చేశాయి. ఇస్లాం గురించి లోతైన విషయాలు తెలుసుకునే అవకాశం కల్పించినందుకు ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. **శాంతియుత సమాజ స్థాపనే లక్ష్యం** అధ్యక్షోపన్యాసం చేస్తూ అబ్దుల్ హై షుయబ్ లతీఫీ మాట్లాడుతూ.. సమాజంలో శాంతిని పెంపొందించడం మరియు అల్లాహ్ సందేశాన్ని అందరికీ చేరవేయడమే తమ లక్ష్యమని వివరించారు. ఈ సందర్భంగా అతిథులకు తెలుగులో అనువదించిన ఖురాన్ గ్రంథాలను మరియు రంజాన్ ప్రత్యేక సంచికలను బహుకరించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జనాబ్ గౌసుర్ రెహ్మాన్ ఉపవాసం యొక్క అంతరార్థం మరియు ఏకేశ్వరోపాసన (తౌహీద్) గురించి విపులంగా ప్రసంగించారు.ఈ స్నేహపూర్వక కలయికలో రిటైర్డ్ డిప్యూటీ కలెక్టర్లు రామ్ దాస్, టి. ఐశ్వర్య, రిటైర్డ్ తహశీల్దార్లు వై. సీతారాం, గుంప శంకరయ్య, మాజీ కో-ఆప్షన్ మెంబర్ అబ్దుల్ షకూర్ తదితరులు పాల్గొన్నారు. జమాతే ఇస్లామీ కార్యకర్తలు, ఎస్.ఐ.ఓ (=ఖూ) సభ్యులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హిందూ-ముస్లిం సోదరులు కలసిమెలసి ఈ వేడుకలో పాల్గొని గంగా-జమునా తెహజీబ్‌ను చాటిచెప్పారు.

# హెచ్‌పివి టీకా కార్యక్రమం విజయవంతంగా నిర్వహణ



**గంగాధర మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం, ఓద్యారంహెచ్ పి వి టీకా గర్భాశయ గ్రీవా క్యాన్సర్ నివారణకు ముఖ్యంగా ఉపయోగపడుతుంది. అలాగే ఇతర హెచ్ పి వి సంబంధిత క్యాన్సర్ల నుండి కూడా రక్షణ కల్పిస్తుంది.ప్రభుత్వ ఆదేశాల ప్రకారం, గంగాధర మండలంలోని జెడ్ పి హెచ్ ఎస్ ఓద్యారం పాఠశాలలో అర్హత గల (26-02-2011 నుండి 25-02-2012 మధ్య జన్మించిన) 1415 సంవత్సరాల బాలికలను పి హెచ్ సి గంగాధరకు తీసుకెళ్లి హెచ్ పి వి టీకా వేయించడం జరిగింది.డా. శ్వేత గారు మరియు డా. శిరీష ఆధ్వర్యంలో, టీకా ఇవ్వడానికి ముందు అవసరమైన ఇతర పరీక్షలు నిర్వహించి, అనంతరం టీకా అందించారు.ఈ టీకా బాలికలను భవిష్యత్తులో వచ్చే గర్భాశయ గ్రీవా క్యాన్సర్ నుండి రక్షించడంలో ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థినుల ఆరోగ్యంపై అవగాహన పెంపొందించడంతో పాటు, వారికి రక్షణ కల్పించడం ముఖ్య ఉద్దేశ్యం.తల్లిదండ్రుల సహకారంతో బాలికలు సురక్షితంగా టీకా పొందారు. ఈ కార్యక్రమం ఇతర విద్యార్థులకు మరియు తల్లిదండ్రులకు కూడా ప్రేరణగా నిలిచింది.మండలంలోని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న అర్హత గల బాలికలందరికీ హెచ్ పి వి టీకా వేయించేందుకు సంబంధిత ప్రధానోపాధ్యాయులను ( హెచ్‌ఎం లు) ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు గారు కోరారు.ఈ సందర్భంగా ఎంఈఓ ఏనుగు ప్రభాకర్ రావు కార్యక్రమాన్ని అభినందిస్తూ, అర్హత గల ప్రతి విద్యార్థిని టీకా పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

# సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవగాహన కార్యక్రమం

**• 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా • వేదిక: మహర్షి డిగ్రీ మరియు పీజీ కళాశాల, ములుగు**







**ములుగు,మార్చి31(పీసీడబ్ల్యూ న్యూస్):** ములుగు పట్టణంలోని మహర్షి డిగ్రీ మరియు పీజీ కళాశాలలో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ అవగాహన కార్యక్రమంను తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో, "99 రోజుల కార్యాచరణ ప్రణాళిక"లో భాగంగా నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే హానికర ప్రభావాలపై అవగాహన కల్పించి, పర్యావరణ హితమైన ప్రత్యామ్నాయాలను ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కాలుష్య నియంత్రణ మండలి నోడల్ అధికారి వి.అరుణాదేవి, =ాజుూ ఆధ్వర్యంలో నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు. కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యం పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడం మరియు ప్లాస్టిక్ కాలుష్యాన్ని తగ్గించడానికి బాధ్యతాయుత చర్యలను ప్రోత్సహించడం.కళాశాల కరస్పాండెంట్ శ్రీ తుమ్మ పిచ్చి రెడ్డి మాట్లాడుతూ, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వల్ల కలిగే పర్యావరణ నష్టాలను వివరించారు. ప్లాస్టిక్ క్యారీ బ్యాగులు, డిస్పోజబుల్ కప్పులు, స్ట్రాలు, ప్యాకేజింగ్ వస్తువులు వంటి వాటిని ఒకసారి ఉపయోగించి పారవేయడం వల్ల తీవ్ర కాలుష్యం ఏర్పడుతుందని తెలిపారు. ప్లాస్టిక్ వ్యర్థాలు కరిగిపోవడానికి చాలా సంవత్సరాలు పడుతాయని, ఇది జీవవ్యవస్థలు, జంతుజాలం మరియు జల వనరులకు పెద్ద ముప్పు అని పేర్కొన్నారు.ప్రిన్సిపాల్ శ్రీ ఎన్. సంజయ్ కుమార్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో పర్యావరణ అవగాహన ఎంతో అవసరమని తెలిపారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, దాని స్థానంలో గుడ్డ సంచులు, పునర్వినియోగ సీసాలు, బయోడిగ్రేడబుల్ వస్తువులను ఉపయోగించాలని సూచించారు. అలాగే రోజువారీ జీవితంలో Reduce, Reuse, Recycle సిద్ధాంతాలను పాటించాలని పిలుపునిచ్చారు.అకాడమిక్ కోఆర్డినేటర్ శ్రీ టి. సుధాకర్ మాట్లాడుతూ, ప్లాస్టిక్ కాలుష్య నివారణలో సమిష్టి బాధ్యత అవసరమని చెప్పారు. వ్యక్తులు, విద్యాసంస్థలు మరియు సమాజం కలిసి పనిచేస్తేనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు. విద్యార్థులు తమ పరిసరాల్లో కూడా అవగాహన కల్పించాలని సూచించారు.ఇతర వక్తలు కూడా విద్యార్థులను పర్యావరణ పరిరక్షణలో చురుకైన పాత్ర పోషించాలని ప్రోత్సహించారు. పర్యావరణ హిత అలవాట్లను అలవర్చుకోవాలని, పరిశుభ్రమైన మరియు హరిత వాతావరణం కోసం కృషి చేయాలని సూచించారు. కార్యక్రమం నిర్వహణలో భాగస్వామ్యమైన కాలుష్య నియంత్రణ మండలి మరియు అధ్యాపకులకు అభినందనలు తెలిపారు.ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ ప్రభావాలపై అవగాహన పెరిగి, పర్యావరణ హిత చర్యలపై ఆసక్తి పెరిగింది. విద్యార్థులు ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించి, శుభ్రమైన మరియు హరిత సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని సంకల్పం వ్యక్తం చేశారు.కార్యక్రమం చివరగా, ప్లాస్టిక్ రహిత మరియు పర్యావరణ అనుకూల సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని సందేశంతో ముగిసింది.

# ముస్లిం గ్రాడ్యుయేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో TS`LAWCET-2026, ఎల్.ఎల్.బి ప్రవేశాలపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం...



**కరీంనగర్,మార్చ్31(పీసీడబ్ల్యూ న్యూస్):** ముస్లిం గ్రాడ్యుయేట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో ముఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో TS`LAWCET-2026 ద్వారా ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాలపై విద్యార్థులకు అవగాహన కల్పిం చారు.కరీంనగర్‌లో నిర్వ హించిన ఈ సమావేశానికి ముస్లిం గ్రాడ్యుయేట్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు మహమ్మద్ ముస్తఫా అలీ అన్సారీ, జనరల్ సెక్రటరీ మహమ్మద్ అల్తాఫ్ అహ్మద్ అడ్వకేట్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.TS`LAWCET-2026 ద్వారా మూడు సంవత్సరాల మరియు ఐదు సంవత్సరాల ఎల్‌ఎల్‌బీ కోర్సుల్లో ప్రవేశాల ప్రక్రియపై వారికి వివరమైన మార్గదర్శకాలు అందించారు.వక్తలు మాట్లాడుతూ, అర్హత కలిగిన విద్యార్థులు వెంటనే దరఖాస్తు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఆలస్య రుసుము లేకుండా దరఖాస్తు చేసుకునే చివరి తేదీ 2026 ఏప్రిల్ 1గా నిర్ణయించబడినట్లు తెలిపారు. అనంతరం ఆలస్య రుసుముతో కూడా దరఖాస్తు చేసే అవకాశం ఉంటుందని చెప్పారు.సమాజంలో ముస్లిం న్యాయవాదులు మరియు న్యాయ విద్యార్థుల అవసరం పెరుగుతున్నదని పేర్కొంటూ, యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.

# ఎసిబి అధికారుల తనిఖీలు....



**సత్తుపల్లి, మార్చి31 (పిసిడబ్ల్యూ న్యూస్):** సత్తుపల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం అవినీతి నిరోధక శాఖ అధికారులు (ఎసిబి)మరియు సిబ్బంది తనిఖీలు నిర్వహించారు. మున్సిపాలిటీ లోని రెవిన్యూ, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్ విభాగాలలో రికార్డులు తనిఖీ చేశారు. ఎసిబి డిఎస్పీ వై రమేష్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎసిబి డిఎస్పీ రమేష్ మాట్లాడుతూ సత్తుపల్లి మున్సిపాలిటీకి సంబంధించి వివిధ శాఖల పైన తమ కార్యాలయానికి వచ్చిన ఫిర్యాదులను అనుసరించి తనిఖీలు చేపట్టడం జరిగిందని గతంలో మున్సిపాలిటీ పట్టణ ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు, వసూలు చేసిన పన్నులు పట్టణాభివృద్ధి లో ఎలా ఖర్చు చేశారు? అన్నీ సక్రమంగానే జరిగాయా అని ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా రికార్డులన్నీ పరిశీలించి తనిఖీ చేస్తున్నామని, ప్రజల వద్దనుండి పన్నులు వసూలు చేయడంలో కొంత జాప్యం జరిగింది అని ఆశించిన స్థాయిలో పన్నులు వసూలు జరగలేదని, మున్సిపల్ అధికారులు కానీ సిబ్బంది కానీ ఏమైనా అవినీతి అక్రమాలకు పాల్పడ్డారేమోననే కోణంలో ఎసిబి తనిఖీలు చేపట్టడం జరిగుతుందని అన్నారు. ప్రస్తుతం ప్రక్రియ కొనసాగుతుంది అని అందులో భాగంగా మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది ఇళ్ళను కూడా ఎసిబి అధీనంలో కి తీసుకొని సోదాలు నిర్వహిస్తున్నామని, మున్సిపల్ అధికారులు మరియు సిబ్బంది మొత్తం అందుబాటులో ఉన్నారని, తనిఖీలు ముగిసిన తర్వాత పూర్తి వివరాలు మీడియాకు వెల్లడిస్తామని తెలిపారు. ప్రజలు ఎవరైనా సరే ఏ ప్రభుత్వ శాఖలో అవినీతి జరిగినా 1064 నెంబర్ కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సూచించారు. మంగళవారం సత్తుపల్లి పట్టణంలో జరిగిన ఎసిబి తనిఖీల్లో డిఎస్పీ వై రమేష్, ముగ్గురు ఇన్స్పెక్టర్ లతో కలిపి మొత్తం 18 మంది సిబ్బంది పాల్గొన్నారు.



# తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ సమీక్ష

**• పెండింగ్ సమస్యల త్వరిత పరిష్కారానికి ఆదేశాలు: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్**



**తల్లాడ, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తహసీల్దార్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ ఆధ్వర్యంలో రెవెన్యూ శాఖ సిబ్బంది, సంబంధిత మండల అధికారులతో విస్తృత స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో భూభారతి కార్యక్రమం పురోగతిపై సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ ప్రత్యేకంగా దృష్టి సారించారు. కార్యక్రమం అమలులో ఎదురవుతున్న సమస్యలు, సాధించిన పురోగతి తదితర అంశాలను సమగ్రంగా పరిశీలించారు. అదేవిధంగా రెవెన్యూ సదస్సుల నిర్వహణ, ప్రజల నుండి అందిన వినతుల పరిష్కార ప్రక్రియపై కూడా సమీక్ష చేపట్టారు. మీ సేవ ద్వారా సర్టిఫికెట్ల జారీ స్థితి, ఎఫ్ఎస్సీ కార్డుల పంపిణీ, అలాగే ఈసీఆర్ భూముల అలియనేషన్‌కు సంబంధించిన ప్రస్తుత పరిస్థితులపై అధికారుల నుండి వివరాలు తెలుసుకున్నారు. ప్రజలకు త్వరితగతిన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని, పెండింగ్‌లో ఉన్న వినతులను ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని సబ్ కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ పథకాలు సమర్థవంతంగా అమలు కావాలంటే శాఖల మధ్య సమన్వయం అవసరమని సూచించారు. ఈ సమీక్ష సమావేశంలో పాల్గొన్న అధికారులు తమ పరిధిలోని సమస్యలను వివరించి, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాసిల్దార్ కరుణాకర్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ స్టాలిన్, మండల స్థాయి అధికారులు, గ్రామ పరిపాలన అధికారులు పాల్గొన్నారు.

# ఆత్మరక్షణకై కరాటే ఒకే నావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో...




**గంగాధర మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం లో ఈరోజు వివేకానంద విద్యాలయంలో ఘనంగా కరాటే బెల్ట్ టెస్ట్ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ ఆధ్వర్యంలో స్థానిక వివేకానంద విద్యాలయంలో నిర్వహించిన కరాటే పోటీ పరీక్షలో సుమారు 90 నుంచి 100 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొని కరాటేలోని వివిధ స్థాయి బెల్టులను మరియు సర్టిఫికెట్స్ సాధించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్థానిక పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ, ఒకినావా కరాటే సంస్థల చీఫ్ ఎగ్జామినర్ కే .వసంత కుమార్ మరియు కరాటే శిక్షకులు పుల్లూరి శ్రీనివాస్ గారు, వివేకానంద పాఠశాల కరస్పాండెంట్ లక్ష్మారెడ్డి డైరెక్టర్ అనంత రెడ్డి ప్రధానోపాధ్యాయులు నర్సింగరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి సబ్ ఇన్స్పెక్టర్ వంశీకృష్ణ మాట్లాడుతూ అమ్మాయిలకు ఆత్మరక్షణ అవసరమని ప్రతి అమ్మాయి కరాటే నేర్చుకోవడం వలన ఆత్మస్థైర్యం మరియు ఏకాగ్రత పెంపొందుతాయని తెలిపారు.

# బయటికి వచ్చిన విద్యుత్ వైర్లు... ప్రమాదానికి ఆహ్వానం!

- పంపు మోటర్ల వద్ద తీవ్ర నిర్లక్ష్యం ఎప్పుడైనా ప్రాణాపాయం
- ప్రజలు భయాందోళనలో వెంటనే చర్యలు తీసుకోవాలని డిమాండ్




**ఏటూరు నాగారం, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ 13వ వార్డు పరిధిలో ఉన్న వాగు దగ్గర ఏర్పాటు చేసిన పంపు మోటర్ల వద్ద ప్రమాదకర పరిస్థితులు నెలకొన్నాయి. మోటర్లకు సంబంధించిన విద్యుత్ వైర్లు బయటికి కనిపిస్తూ ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. ప్రజలు తిరిగే ప్రదేశంలోనే ఈ వైర్లు బహిర్గతంగా ఉండటం వల్ల ఎప్పుడైనా ప్రమాదం జరిగే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా చిన్నపిల్లలు, పశువులు ఈ ప్రాంతంలో సంచరిస్తుండటంతో ప్రమాదం మరింత పెరిగిందని చెబుతున్నారు. స్థానికులు చెబుతున్నదాని ప్రకారం, ఈ పంపు మోటర్ల వద్ద భద్రతా చర్యలు పూర్తిగా లేవని, వైర్లను సరిగా కప్పకుండా నిర్లక్ష్యంగా వదిలేశారని ఆరోపిస్తున్నారు. ఇది పెద్ద ప్రమాదానికి దారితీయొచ్చని వారు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత విద్యుత్ శాఖ, గ్రామపంచాయతీ అధికారులు వెంటనే స్పందించి, బయటికి ఉన్న వైర్లను సురక్షితంగా మరమ్మతు చేసి, ప్రజల ప్రాణాలకు ముప్పు లేకుండా చర్యలు తీసుకోవాలని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

# మానవత్వానికి మారుపేరు యలమందల జగదీష్

- ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకుల పంపిణీ





**ఖమ్మం ప్రతినిధి, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఇద్దరు పేద కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు పంపిణీ చేసి మానవత్వానికి మారుపేరుగా నాయి బ్రాహ్మణ సేవా సంఘం నగర అధ్యక్షులు అండ్ ఎలక్ట్రానిక్ మీడియా నగర అధ్యక్షులు యలమందల జగదీష్ నిలిచారు. ఖమ్మం అర్బన్ మండలం కైకొండాయిగూడెం, 1వ డివిజన్ లో మంగళవారం బోడ నాగేశ్వరరావు (చిన్న), బోడ ఉమ అనారోగ్యంతో మరణించి అనాదలుగా మిగిలిన ముగ్గురు పిల్లలు ఉన్న కుటుంబానికి, అదేవిధంగా కొడుకు చనిపోయి అనారోగ్యంతో ఒంటరి జీవితం గడుపుతున్న బొమ్మకంటి బూబమ్మ కుంటుంబానికి, ఇరువురి కుటుంబాలకు నెలకు సరిపడ నిత్యవసర సరుకులు, 25కేజీల బియ్యం, కొంత ధన రూపంలో ఆర్థికసాయం అందించి జగదీష్ మానవత్వం చాటుకున్నారు. ఈ సందర్భంగా యలమందల జగదీష్ మాట్లాడుతూ.. పేదవారికి, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవడం మానవ ధర్మం అన్నారు. మానవసేవయే మాధవసేవ అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గుర్రం వెంకట్రామయ్య, తుళ్లూరు ప్రసాద్, గుర్రం కృష్ణయ్య, తేజావత్ వీరన్న, గద్దల నాగేశ్వరరావు, తేజావత్ సంఘం, జక్కంపూడి సతీష్, తుళ్లూరు మధు, జగదీష్ యువసైన్యం మంచాల నాగ, తోట సతీష్, ఆంగోతు కిషోర్, కంచర్ల శేఖర్, పందుల కార్తిక్, ఉప్పెర్ల ఉదయ్, కొండా రాకేష్, బొమ్మకంటి జగదీష్, లింగనబోయిన నవదీప్, మంచాల రాజు, లింగనబోయిన హేమంత్, మల్లు భరత్, రాగం పండు, వనపర్తి ఉదయ్, తేజావత్ బాలకృష్ణ, కుమ్మరకుంట్ల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# "గుడుంబా మత్తులో రోడ్లపై పడిపోతున్న ప్రజలు.. గ్రామంలో ఆందోళన!"

**అక్రమ మద్యం కాటుకు కుటుంబాలు చెల్లాచెదురు**

**యువత గళం ఎక్సైజ్, పోలీసులకు వినతిపత్రం**



**ఏటూరు నాగారం,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లా ఏటూరు నాగారం మండలంలోని మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గుడుంబా (అక్రమ మద్యం) నిర్మూలనకు యువత ముందడుగు వేసింది. గ్రామాల్లో గుడుంబా విస్తృతి రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని యువత ఆవేదన వ్యక్తం చేసింది. ప్రత్యేకంగా మద్యం మత్తులో రోడ్లపై పడిపోవడం, కుటుంబాల్లో కలహాలు, సామాజిక సమస్యలు అధికమవుతున్నాయని వారు పేర్కొన్నారు. ఇటువంటి ఘటనలు గ్రామంలో భయాందోళనకు దారితీస్తున్నాయని తెలిపారు. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని 13వ వార్డు సభ్యుల సహకారంతో యువత బృందం గుడుంబా నిర్మూలనపై కఠిన చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. యూత్ ప్రెసిడెంట్ జాకరాజు, వైస్ ప్రెసిడెంట్ ముదురుకోల సతీష్, మాజీ వార్డు సభ్యుడు నాగసాగర్ నాయకత్వంలో యువత ఎక్సైజ్ ఆఫీస్ మరియు పోలీస్ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. గ్రామాల్లో జరుగుతున్న అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. యువత మాట్లాడుతూ, "గుడుంబా ప్రభావం ప్రతి ఇంటిపైన పడుతోంది. కొంతమంది మద్యం సేవించి కుటుంబాల్లో గొడవలు సృష్టిస్తున్నారు. దీనివల్ల మహిళలు, పిల్లలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు" అని తెలిపారు. అదేవిధంగా, గుడుంబా నిర్మూలనలో పోలీసులకు పూర్తి సహకారం అందించేందుకు తాము ఎప్పుడూ సిద్ధంగా ఉంటామని యువత స్పష్టం చేసింది. ఈ కార్యక్రమంలో నాగరాజు, గంగరాజు, రాజు తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు ఆర్థికంగా బలోపేతం కావాలి

**మహాలక్ష్మి పథకం మహిళలకు ఆర్థిక భరోసా**

**ఉచిత బస్సు ప్రయాణం వెలకట్టలేనిది**

**మహిళా సంఘాలే అసలైన శక్తికి నిదర్శనం**

**:: జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్**




**ములుగు జిల్లా,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతి మహిళ ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకుంటూ ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలు ఆర్థికంగా ఎదగాలని, ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం మహిళల జీవితాల్లో వెలుగు నింపుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. తెలిపారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా "మహిళలకు ఆర్టీసీ ఉచిత బస్సు సౌకర్యం – ఉత్సవాలు 2026" కార్యక్రమాన్ని నిర్వహించారు. రాష్ట్రవ్యాప్తంగా 29.03.2026 నాటికి 290 కోట్ల ప్రయాణాల ద్వారా సుమారు 10 వేల కోట్ల రూపాయల ప్రయాణ ఛార్జీలు ఆదా అయ్యాయని వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలతో ప్రతి కుటుంబం ఆర్థికంగా స్థిరపడాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ములుగు జిల్లాలో ఇప్పటి వరకు 1.90 కోట్ల ప్రయాణాల ద్వారా మహిళలు 133.25 కోట్ల రూపాయలను ఆదా చేసుకున్నారని స్పష్టం చేశారు. సామాన్య ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకునే ప్రభుత్వం పథకాలను రూపొందిస్తుందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని తెలిపారు. ఈ పథకం ద్వారా కూలీ పనులు చేసుకునే వారు, మధ్యతరగతి మహిళలు మరియు ఉద్యోగినులు ఎంతో లబ్ధి పొందుతున్నారని కలెక్టర్ అన్నారు. "గతంలో దూర ప్రాంతాల్లో ఉన్న బిడ్డలను చూడాలంటే ప్రయాణ ఖర్చుల గురించి ఆలోచించేవాళ్లమని, ఇప్పుడు రూపాయి ఖర్చు లేకుండా సాఫీగా ప్రయాణం చేస్తున్నామని" ఒక లబ్ధి పొందిన మహిళ తనతో సంతోషాన్ని పంచుకుందని గుర్తు చేశారు. మహిళా సంఘాలను మరింత బలోపేతం చేస్తూ త్వరలోనే సోలార్ యూనిట్లు, పెట్రోల్ బంకులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి మహిళా సంఘాల్లో సభ్యులుగా చేరాలని పిలుపునిచ్చారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోత్ రవిచందర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడా లేని విధంగా కేవలం ఆధార్ కార్డుతో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించడం గర్వకారణమని, దీనివల్ల వేల కోట్ల రూపాయల ఆదా చేసుకోగలిగారని హర్షం వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ చింతనిప్పుల చంద్రకళ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం ఏర్పడగానే మహిళల సంక్షేమమే ధ్యేయంగా మహాలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిందని అన్నారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలనే లక్ష్యంతో "ఇందిరా మహిళా శక్తి" పథకం ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, ఆర్టీసీ డి.ఎం. రవిచందర్, అడిషనల్ డి.ఆర్.డి.ఓ. శ్రీనివాస్, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పద్మ, సంబంధిత అధికారులు, తదితరులు, పాల్గొన్నారు.

# ఈసీఐఎల్ - హైదరాబాద్‌లో ఆధునిక సౌకర్యాలతో రాధా స్టడీ హాల్స్ ప్రారంభం



- **ప్రారంభకులు: గడ్డం వివేక్ తెలంగాణ మంత్రి**

**మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా,మార్చి 31,(పిసీడబ్ల్యూ న్యూస్):** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ కాప్రా మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదురుగా గ్రీన్ హిల్స్ కాలనీ రోడ్ లో రాధా స్టడీ హాల్స్ ను( బుక్ రీడింగ్ సెంటర్ ) అట్టహాసంగా తెలంగాణ రాష్ట్ర మంత్రివర్యులు గౌరవనీయులు డాక్టర్ గడ్డం వివేక్ వెంకటస్వామి ప్రారంభించారు, అనంతరం రాధా స్టడీ హాల్స్ అధినేత గౌడ రాధా కిరణ్ మాట్లాడుతూ నేటి వేగవంతమైన, పోటీ ప్రపంచంలో, పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు మరియు అభ్యర్థులకు చదువుకోవడానికి ప్రశాంతమైన, అన్ని సౌకర్యాలు గల ప్రదేశం ఉండటం చాలా అవసరం. ఏకాగ్రతతో కూడిన అభ్యాసానికి, ఉత్పాదకతకు అనువైన వాతావరణాన్ని అందించేలా రూపొందించిన సరికొత్త స్టడీ సెంటర్‌ను ప్రారంభిస్తున్నామని తెలియజేయడానికి మేము సంతోషిస్తున్నాముఈ ఆధునిక స్టడీ సెంటర్‌లో ఏసీ మరియు నాన్-ఏసీ సీటింగ్ ఎంపికలు ఉన్నాయి, దీనివల్ల విద్యార్థులు తమ సౌకర్యానికి, అనుగుణంగా ఎంచుకోవచ్చు. ఈ కేంద్రం నాణ్యమైన విద్యా సౌకర్యాలు ప్రతి ఒక్కరికీ అందుబాటులో ఉండేలా చూస్తుంది .ఏకాగ్రతతో చదువుకునే వారి అవసరాలను అర్థం చేసుకుని, ఈ కేంద్రం 24ఐ7 పనిచేస్తుంది. అందువల్ల ఉదయాన్నే లేచేవారితో పాటు రాత్రిపూట ఆలస్యంగా నిద్రపోయేవారికి కూడా ఇది చాలా అనువుగా ఉంటుంది. మీరు పోటీ పరీక్షలకు, విద్యా సంబంధిత చదువులకు, లేదా వృత్తిపరమైన సర్టిఫికేషన్‌లకు సిద్ధమవుతున్నప్పుడు ఎలాంటి అంతరాయం లేకుండా చదువుకోవచ్చు అని ఆమె తెలిపారు. రాధా స్టడీ హాల్స్ (రీడింగ్ సెంటర్) ను ప్రారంభోత్సవాన్ని పురస్కరించుకొని ముఖ్య అతిధి తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్యులు గడ్డం వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ ఈ రాధా స్టడీ హాల్స్ (బుక్ రీడింగ్ సెంటర్ ) లో చదువుకునే వారికీ ప్రశాంతమైన వాతావరణాన్ని సృష్టించేలా ఈ కేంద్రాన్ని ఆలోచనాత్మకంగా రూపొందించారు. అంతేకాకుండా, ఎక్కువసేపు చదువుకునే సమయంలో విద్యార్థులందరికీ సౌకర్యాన్ని కల్పిస్తూ,శుభ్రమైన, సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంది. ప్రశాంతంగా మరియు శబ్దానికి దూరంగా ఉటుందిఅనుకూలమైన చదువుల కోసం 24/7అందుబాటులో ఉంటుంది ఏూజ మరియు నాన్-AC ఎంపికలు అందుబాటులో ఉన్నాయి విద్యార్థి-స్నేహపూర్వక వాతావరణంఈ స్టడీ సెంటర్ కేవలం కూర్చుని చదువుకునే ప్రదేశం మాత్రమే కాదుఇది క్రమశిక్షణ, ఏకాగ్రత మరియు విజయాన్ని ప్రేరేపించడానికి నిర్మించిన ఒక వేదిక. మెరుగైన అధ్యయన విధానాన్ని అనుభవించడానికి విద్యార్థులందరి నీ సందర్శించమని మేము ఈ స్టడీ హాల్స్ ను సందర్శించి ఆస్వాదించి ఆ తరువాత మిమ్మల్ని సాదరంగా ఆహ్వానిస్తున్నాము. విజయం వైపు మీ ప్రయాణాన్ని ఈరోజే ప్రారంభించండి అని మంత్రి గడ్డం వివేక్ అన్నారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథులుగా ఉప్పల్ నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ బండారు లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ ప్రజాకవి శ్రీ గోరేట వెంకన్న, ఆలేరు నియోజకవర్గ మాజీ ఎం ఎల్ ఏ కుడుదుల నగేష్, స్థానిక మాజీ కార్పొరేటర్స్ గొల్లూర్ అంజయ్య, కార్పొరేటర్ ప్రభుదాసు, మాజీ కార్పొరేటర్ అమిరుద్దీన్, కార్పొరేటర్ బొంతు శ్రీదేవి,



కార్పొరేటర్ గున్నాల సునీత, మాజీ కార్పొరేటర్ పావని రెడ్డి, కుషాయిగూడ బస్ డిపో మేనేజర్ వి వేణుగోపాల్, కుషాయిగూడ పోలీస్ సబ్ ఇన్స్పెక్టర్ విజయ్, మల్కాజ్గిరి సబ్ ఇన్స్పెక్టర్ గణేష్ బాబు, స్థానిక నాయకులు అధికారులు మరియు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ రాష్ట్ర నాయకులు అధిక సంఖ్యలో పాల్గొనిన వారందరికీ రాధా స్టడీ హాల్స్ బుక్ రీడింగ్ సెంటర్ యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపారు.




# ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహణ: డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు



**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలి**

**ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, గ్రామసభ నిర్వహణపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్షించిన డిప్యూటీ సిఎం.**

**ములుగు జిల్లా,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రతిబింబించేలా గ్రామసభ నిర్వహించాలని డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క మల్లు తెలిపారు. రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక, ఇంధన శాఖల మంత్రివర్యులు భట్టి విక్రమార్క మల్లు మంగళవారం హైదరాబాద్ నుంచి ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం అమలు, ఏప్రిల్ 2న నిర్వహించే గ్రామ, వార్డుసభల నిర్వహణపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే. రామకృష్ణా రావు, ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశానికి ములుగు కలెక్టరేట్ నుంచి జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. పాల్గొన్నారు.ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలలో ప్రజలకు అందించే సమాచారం ఒకే రీతిన ఉండాలని, గ్రామ సభలకు వార్డు మెంబర్ నుంచి ఎంపీ, మంత్రుల వరకు ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని అన్నారు.గ్రామసభలో ముఖ్యమంత్రి సందేశం, ప్రభుత్వ పథకాల లబ్ధిదారుల పేర్లను చదివి వినిపించాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, నూతన రేషన్ కార్డు, సన్న బియ్యం సరఫరా, గిరిజన రైతులకు ఉచిత పంపు సెట్లు వంటి వివిధ పథకాల ద్వారా లబ్ధి పొందుతున్న లబ్ధిదారుల చేత గ్రామ సభలలో మాట్లాడించాలని అన్నారు.జూన్ 2 నుంచి ప్రారంభించే ఇందిరమ్మ జీవిత బీమా పథకం, ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు అల్పాహార కార్యక్రమంతో పాటు, పాలు, రాగి జావా అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు వివరించాలని అన్నారు. ప్రజల నుంచి వచ్చే ఫీడ్ బ్యాక్ విస్తృతంగా ప్రచారం జరిగేలా చూడాలని అన్నారు. సాంస్కృతిక శాఖ కళాకారులను ఉపయోగిస్తూ ప్రభుత్వ పథకాలపై విస్తృత ప్రచారం కల్పించేందుకు యాక్షన్ ప్లాన్ తయారు చేయాలని అన్నారు.గ్రామాలకు ప్రభుత్వం భారీ ఎత్తున విడుదల చేసిన నిధులను గ్రామ అభివృద్ధికి వినియోగించాలని డిప్యూటీ సీఎం సూచించారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాన్ని ఎప్పటికప్పుడు కలెక్టర్లు సమీక్షిస్తూ విజయవంతంగా అమలు చేయాలని డిప్యూటీ సీఎం ఆదేశాలు జారీ చేశారు.సీఎస్ కె.రామకృష్ణా రావు మాట్లాడుతూ, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మార్చ్ 6 నుంచి 15 వరకు నిర్వహించిన పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కారం, పారిశుధ్య నిర్వహణ కార్యక్రమానికి మంచి స్పందన వచ్చిందని, అదే స్ఫూర్తితో ఏప్రిల్ 2న గ్రామ, వార్డు సభలు విజయవంతంగా నిర్వహించాలని తెలిపారు.ప్రతి జిల్లాలో గ్రామ సభలు ఎలా జరుగుతున్నాయి అనే అంశంపై రిపోర్టు అందించాలని కలెక్టర్ లను ఆదేశించారు. గ్రామ సభలలో ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొనేలా చూడాలని, స్థానిక



ప్రజా ప్రతినిధులు తప్పనిసరిగా గ్రామసభలో ఉండాలని అన్నారు.గ్రామ సభలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తూ, వివిధ పథకాల లబ్ధిదారుల వివరాలు తెలియ జేయాలని అన్నారు. గ్రామంలో ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యలను ప్రజలకు వివరించాలని అన్నారు. గ్రామసభ తరహాలో మున్సిపాలిటీ వార్డులో సైతం సభలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ లకు సీఎస్ సూచించారు. ప్రభుత్వం ఇప్పటికే అమలు చేస్తున్న సంక్షేమ పథకాలతో పాటు ప్రస్తుత బడ్జెట్ లో ప్రతిపాదించిన వివిధ పథకాలకు సంబంధించిన మార్గదర్శకాలను కూడా గ్రామ, వార్డు సభలలో ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. అనంతరం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్. మాట్లాడుతూ మున్సిపాలిటీలో ప్రజలందరికీ ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం తెలిసే విధంగా వార్డు సభలు నిర్వహించాలని అన్నారు. జిల్లాలోని అన్ని గ్రామ పంచాయతీలలో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ



ప్రణాళికలో భాగంగా ఏప్రిల్ 2 తేదీన గ్రామ, వార్డు సభలు నిర్వహించాలని తెలిపారు. గ్రామ, వార్డు సభలు నిర్బహణపై ప్రభుత్వం జారీ చేసిన షెడ్యూల్ మరియు స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ప్రకారం, జిల్లాలోని ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభలు సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేక అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ సభల ద్వారా ప్రజల సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి కార్యాచరణ ప్రణాళిక రూపొందించడం ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. ప్రజల భాగస్వామ్యంతో గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను వేగవంతం చేయడం కోసం ఈ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియమితులైన ప్రత్యేక అధికారులు తమకు కేటాయించిన గ్రామ పంచాయతీలలో గ్రామ సభలను తప్పనిసరిగా నిర్వహించి, నివేదికలను సమర్పించాలని కలెక్టర్ ఆదేశించారు.జిల్లాలోని ప్రజలందరూ గ్రామ సభలకు హాజరై తమ అభిప్రాయాలు, సమస్యలను వెల్లడించి, గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలని కోరారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు సి.హెచ్. మహేందర్ జి, సంపత్ రావు, ఆర్డీఓ వెంకటేష్, డి పి ఓ వెంకయ్య, డి ఎం అండ్ హెచ్ ఓ గోపాల్ రావు, డి ఈ ఓ సిద్ధార్థ రెడ్డి, డి ఏ ఓ సురేష్ కుమార్, సిపిఓ ప్రకాశ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## మంత్రి పొంగులేటి పైన విమర్శలు అర్థ రహితం: కాంగ్రెస్ నాయకులు సృష్టికరణ



**కల్లూరు, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :**రాష్ట్ర రెవిన్యూ సమాచార గృహ నిర్మాణ శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి పై బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలు చేసిన ఆరోపణలు అర్థరహితమని అవాస్తమని కాంగ్రెస్ నాయకులు స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ ధరావత్ మోహన్ నాయక్, ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్ చౌదరి, ఆర్య వైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు తదితరులు మాట్లాడుతూ పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాజకీయాల్లో రాక ముందే డబ్బులు సంపాదించారని కేవలం ప్రజాసేవ చేయటం కోసమే రాజకీయాల్లోకి వచ్చి మచ్చలేని నాయకుడిగా పొంగులేటి ఎదిగారని అన్నారు. టిఆర్ఎస్ పార్టీ చేస్తున్న ఆరోపణలు అవాస్తమని స్పష్టం చేశారు. ఇలాంటి ఆరోపణలు చేయటం ఆ పార్టీకి తగదని అన్నారు. ఇదే విధంగా ప్రవర్తిస్తే ప్రజలే గుణపాఠం చెప్తారని వారు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి మాజీ డైరక్టర్ సీనియర్ నాయకులు పెద్దబోయన శ్రీనివాసరావు, కల్లూరు మున్సిపల్ 4 వార్డ్ కౌన్సిలర్ భూక్య రాంబాయి, 16 వార్డ్ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, 3 వార్డ్ కౌన్సిలర్ దాసరి సుధారాణి, యాస శ్రీకాంత్, కిష్టంశెట్టి కొండలు, ఖమ్మంపాటి వీరస్వామి, శీలం కృష్ణా రెడ్డి, అల్లకుంట నరసింహారావు, జిల్లెళ్ల కృష్ణారెడ్డి, యేసురెడ్డి, కుంచాల గురవయ్య, ఆప్రోజ్, పొన్నూరు వెంకటేశ్వరరావు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

## యాక్సిడెంట్‌లో గాయపడిన బద్రునాయక్‌ను పరామర్శించిన ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రాంచందర్ నాయక్

**హైదరాబాద్ , మార్చ్ 31 (పిసిడబ్ల్యూ న్యూస్):**తీవ్ర రోడ్డు ప్రమాదంలో గాయపడి హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ధారావత్ బద్రునాయక్‌ను ప్రభుత్వ విప్, డోర్నకల్ శాసనసభ్యులు డా. జాటోత్ రాంచందర్ నాయక్ పరామర్శించారు.సిరోల్ మండలం కొర్లకుంట తండాకు చెందిన గ్రామ సర్పంచ్ కుమారుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు అయిన బద్రునాయక్ ఇటీవల కురవి ఏకలవ్య గురుకులం సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు, కుటుంబ సభ్యులు ఆయనను మహబూబాబాద్‌లోని మైత్రి ఆసుపత్రికి తరలించగా, గాయాల తీవ్రత అధికంగా ఉండటంతో వైద్యులు మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్ నిమ్స్ ఆసుపత్రికి రిఫర్ చేశారు.ప్రస్తుతం నిమ్స్ వైద్యుల



పర్యవేక్షణలో చికిత్స కొనసాగుతుండగా, ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యులు ఒక కాలును తొలగించాల్సిన పరిస్థితి ఏర్పడినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో డా. జాటోత్ రాంచందర్ నాయక్ నిమ్స్ ఆసుపత్రికి వెళ్లి బద్రునాయక్ ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్నారు.అనంతరం కుటుంబ సభ్యులతో



మాట్లాడిన ఎమ్మెల్యే వారికి ధైర్యం చెప్పి, ఎలాంటి ఆందోళన చెందవద్దని సూచించారు. చికిత్సకు అవసరమైన అన్ని విధాల సహకారం అందిస్తామని హామీ ఇచ్చి, ప్రభుత్వం తరఫున పూర్తి సహాయం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపా రు. బద్రునాయక్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, కుటుంబ సభ్యులకు మనోధైర్యం నింపారు.

## విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిండు ప్రాణాలు బలి కావాల్సిందే...

- ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ఎస్సీ కాలనీవాసులు
- తక్షణమే స్పందించి విద్యుత్ స్తంభాన్ని మార్చండి
- సీసీ రోడ్డు నుండి 10 ఫీట్ల ఎత్తులోనే వేలాడుతున్న విద్యుత్ తీగలు



**తొర్రూర్ ప్రతినిధి, మార్చి 31(పిసీడబ్ల్యూ న్యూస్):**మామూలు విద్యుత్ షాక్ తలుగుతేనే ప్రాణాలు కోల్పోతారు. అలాంటిది ఎస్సీ కాలనీలో గత 40 సంవత్సరాల క్రితం వేసిన విద్యుత్ స్తంభం సిసి రోడ్డు మధ్యలోనే స్తంభాన్ని వేశారు. అది పూర్తిస్థాయిగా నేలకు వంగిపోయి విద్యుత్ తీగలు సీసీ రోడ్డు నుండి పది ఫీట్ల ఎత్తులోనే చేతికి అందే విధంగా ఉన్నాయని కాలనీవాసులను భయభ్రాంతులకు గురిచేస్తుంది. ఈ విషయాన్ని గతంలో ఎన్నోసార్లు విద్యుత్ అధికారులకు విన్నవించినప్పటికీ కూడా వారిలో ఎలాంటి స్పందన లేకపోవడం వలన ఏమి చేయలేని నిస్సహాయులుగా మారిపోయారు. మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ మండల కేంద్రంలోని గుర్తుర్ గ్రామంలో గల ఎస్సీ కాలనీలో ఉన్న సవారు లచ్చమ్మ గుడి సమీపంలోని పక్కనే ఉన్న గృహానికి ఆనుకొని ఉన్న విద్యుత్ స్తంభం పూర్తిస్థాయిలో భయభ్రాంతులకు గురి చేసే విధంగా ఉండటం ఈ విషయం అటు విద్యుత్ అధికారులతో పాటు గ్రామ సర్పంచ్ విసంపల్లి కవితా బాలకృష్ణ దృష్టికి కూడా తీసుకువెళ్లారు. విద్యుత్ అధికారులతో చర్చించి వెంటనే స్పందించి విద్యుత్ స్తంభాన్ని ఏర్పాటు చేసి కాలనీవాసుల భయభ్రాంతులను తొలగించాలని ఏ రాత్రిగాలి దుమారం వచ్చిన ఏ ఇంటిపై విద్యుత్ స్తంభం కూలిపోతుందో అర్థం కాని విధంగా చోటు చేసుకున్నదని కాలనీవాసులందరూ భయపడుతున్నామని అన్నారు .ఇదే కాకుండా ఆ గుడి మార్గం ద్వారా వెళ్లడానికిభయానికి గురవుతున్నమని పేర్కొన్నారు. అటుగా వెళ్లిన పి సి డబ్ల్యూ న్యూస్ జర్నలిస్ట్ మనోర స్వామి దృష్టికి ప్రమాద స్థాయికి చేరుకున్న విద్యుత్ స్తంభం గురించి వివరించారు. కాలనీలో ఇలాంటి మరికొన్ని విద్యుత్ స్తంభాలు ఇలాంటి పరిస్థితుల్లోనే ఉన్నాయని వాటిని వెంటనే తొలగించి నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయాలని కాలనీవాసులు వేడుకుంటున్నారు.

## రద్దు చేసిన కార్మిక చట్టాలను పునరుద్ధరించాలి




- లేబర్ కోడ్ల రద్దుకై ఏప్రిల్ ఒకటిన బ్లాక్ డే
- అఖిలపక్ష కార్మిక సంఘాల నాయకులు

**ఖమ్మం అర్బన్, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్):** రద్దు చేసిన 29 కార్మిక చట్టాలను వెంటనే పునరుద్ధరించాలని అఖిలపక్ష కార్మిక సంఘాల -నాయకులు డిమాండ్ చేశారు. నాలుగు లేబర్ కోడ్లు రద్దు చేయాలని కోరుతూ అఖిలపక్ష సంఘాల ఆధ్వర్యంలో ఏప్రిల్ ఒకటిన దేశవ్యాప్త బ్లాక్డే నిర్వహించనున్నట్లు సంఘాల నాయకులు తెలిపారు. ఖమ్మం గిరిప్రసాద్ భవన్లోని ఏఐటియుసి కార్యాలయంలో ఏఐటియుసి జిల్లా అధ్యక్షులు గాదె లక్ష్మి నారాయణ అధ్యక్షతన అఖిలపక్ష కార్మిక సంఘల సంయుక్త -సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అఖిలపక్ష నాయకులు మాట్లాడుతూ గత 100 ఏళ్లుగా కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో కార్మికులకు వ్యతిరేకంగా యాజమాన్యాలకు అనుకూలంగా కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను తీసుకు వచ్చిందన్నారు. కార్మిక చట్టాలలో అతి ముఖ్యమైన పారిశ్రామిక వివాదాల చట్టం, ట్రేడ్ యూనియన్ రిజిస్ట్రేషన్ యాక్ట్ 1926, పారిశ్రామిక ఉపాధి (స్టాండ్ ఆర్డర్స్) చట్టం, 1946 పారిశ్రామిక వివాదాల చట్టం 1947 తదితర చట్టాలను పూర్తిగా రద్దు చేసి వాటి స్థానంలో తీసుకువచ్చిన పారిశ్రామిక సంబంధాల కోడ్ 2022లో అన్ని అంశాలు ఉన్నట్లుగానే కనిపిస్తాయని కానీ అవి ఆచరణకు సాధ్యం కావని వారు తెలిపారు. మోడీ ప్రభుత్వం భవిష్యత్తులో పర్మినెంట్ ఉద్యోగాలు లేకుండా కాలపరిమితితో కూడిన ఉద్యోగాలను -సృష్టిస్తుందని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అగ్నివీర్, అగ్నిపద్ లాంటి పథకాలతో ఈ విధానాలకు శ్రీకారం చుట్టిందన్నారు. పారిశ్రామికవేత్తల ఆదేశాల మేరకు 12 గంటల పనివిధానాన్ని ప్రవేశపెట్టి బిజెపి పాలిత రాష్ట్రాలైన ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, కర్నాటకలో ఆమోదింపజేశారని వారు విమర్శించారు. దీని ఫలితంగానే కర్నాటక ప్రజలు ఆగ్రహానికి గురై అధికారాన్ని కోల్పోవాల్సి వచ్చిందన్నారు. మోడీ కార్మిక వ్యతిరేక నిరంకుశ విధానాలకు వ్యతిరేకంగా సెంట్రల్ ట్రేడ్ యూనియన్ ఇచ్చిన పిలుపు మేరకు భారతదేశ వ్యాప్తంగా ఏప్రిల్ ఒకటిన బ్లాక్ ను నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. అందులో భాగంగా బుధవారం ఉదయం 10 గంటలకు అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో అంబేడ్కర్ సెంటర్లో నిరసన బ్లాక్డేను -నిర్వహించనున్నట్లు వారు తెలిపారు. ఈ సమావేశంలో ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి తోట రామాంజనేయులు, వర్కింగ్ ప్రెసిడెంట్ రావి శివరామకృష్ణ, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి టి. విష్ణువర్ధన్, ఐఎన్టియుసి టౌన్ వర్కింగ్ ప్రెసిడెంట్ కుక్కల రామకృష్ణ, ఉపాధ్యక్షులు సిద్దెల నగేష్, టియుసిఐ రాష్ట్ర నాయకులు సివై పుల్లయ్య, కె. శ్రీనివాస్, ఐఎఫయు జిల్లా -అధ్యక్షులు సుబాని, జిల్లా నాయకులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యాయవృత్తికి వన్నె తెచ్చిన యెలిగి శంకర్

## బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ

**ఖమ్మం, ప్రతినిధి మార్చి 3 (పిసిడబ్ల్యూ న్యూస్):** న్యాయ వ్యవస్థలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీడీపీ) యెలిగి శంకర్ సమాజానికి ఎనలేని సేవలు అందించారని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ లుకొనియాడారు. మంగళవారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించిన శంకర్ పదవీ విరమణ మరియు ఆత్మీయ వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. **అంకితభావానికి నిదర్శనం** ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శంకర్ కేవలం ప్రభుత్వ అధికారిగా మాత్రమే కాకుండా, ఒక నిబద్ధత కలిగిన స్వయంసేవక్‌గా సమాజ హితం కోసం నిరంతరం కృషి చేశారని ప్రశంసించారు. అధికారిక బాధ్యతల నుంచి విరమణ పొందుతున్నప్పటికీ, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఆయన సామాజిక ప్రస్థానం నిరంతరం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వృత్తి పట్ల ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ నేటి యువ న్యాయవాదులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. **యువతకు మార్గదర్శి** న్యాయవాద వృత్తికి శంకర్ అపూర్వమైన గౌరవాన్ని తీసుకువచ్చారని, ఎంతోమంది యువకులను ఉత్తమ



న్యాయవాదులుగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని కోటేశ్వరరావు గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో రాజకీయంగా కూడా ఆయన మరింత చురుకైన పాత్ర పోషించి, యువతకు దిశానిర్దేశం చేయాలని కోరారు. శంకర్ దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో శేష జీవితాన్ని గడపాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండారి నరేష్, మందా సరస్వతి, దొడ్డ అరుణ తదితరులు తో పాటు జిల్లాలోని పలువురు సీనియర్ న్యాయవాదులు, ఇతర రంగాల ప్రముఖులు పాల్గొని శంకర్ అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు. న్యాయ వ్యవస్థలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును సంపాదించుకున్న డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ (డీడీపీ) యెలిగి శంకర్ సమాజానికి ఎనలేని సేవలు అందించారని భారతీయ జనతా పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు, భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గల్లా సత్యనారాయణ లుకొనియాడారు. మంగళవారం ఖమ్మంలో ఘనంగా నిర్వహించిన శంకర్ పదవీ విరమణ మరియు ఆత్మీయ వీడ్కోలు సభకు ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, శంకర్ దంపతులను ఘనంగా సన్మానించారు. **అంకితభావానికి నిదర్శనం** ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, శంకర్ కేవలం ప్రభుత్వ అధికారిగా మాత్రమే కాకుండా, ఒక నిబద్ధత కలిగిన స్వయంసేవక్‌గా సమాజ హితం కోసం నిరంతరం కృషి చేశారని ప్రశంసించారు. అధికారిక బాధ్యతల నుంచి విరమణ పొందుతున్నప్పటికీ, ఒక బాధ్యతాయుతమైన పౌరుడిగా ఆయన సామాజిక ప్రస్థానం నిరంతరం కొనసాగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. వృత్తి పట్ల ఆయన చూపిన అంకితభావం, క్రమశిక్షణ నేటి యువ న్యాయవాదులకు ఎంతో స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. **యువతకు మార్గదర్శి** న్యాయవాద వృత్తికి శంకర్ అపూర్వమైన గౌరవాన్ని తీసుకువచ్చారని, ఎంతోమంది యువకులను ఉత్తమ న్యాయవాదులుగా తీర్చిదిద్దడంలో ఆయన పాత్ర ప్రశంసనీయమని కోటేశ్వరరావు గుర్తుచేశారు. రాబోయే రోజుల్లో రాజకీయంగా కూడా ఆయన మరింత చురుకైన పాత్ర పోషించి, యువతకు దిశానిర్దేశం చేయాలని కోరారు. శంకర్ దంపతులు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో శేష జీవితాన్ని గడపాలని ఆయన మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు బండారి నరేష్, మందా సరస్వతి, దొడ్డ అరుణ తదితరులు తో పాటు జిల్లాలోని పలువురు సీనియర్ న్యాయవాదులు, ఇతర రంగాల ప్రముఖులు పాల్గొని శంకర్ అందించిన విశిష్ట సేవలను స్మరించుకున్నారు.

# లింగ నిష్పత్తి పరిరక్షణకు పటిష్టమై చర్యలు

## - జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దనాలకోట రామారావు
## - చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు
## - ఖమ్మం జిల్లాలో పీసీపీఎన్‌డిటి చట్టం అమలుపై క్వార్టర్లీ సమీక్ష సమావేశం






**ఖమ్మం ప్రతినిధి, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** లింగ నిష్పత్తి పరిరక్షణకు పటిష్టమై చర్యలు తీసుకుంటామని, చట్ట ఉల్లంఘనలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ దనాలకోట రామారావు అన్నారు. ఖమ్మం జిల్లాలో పీసీపీఎన్‌డిటి చట్టం-1994 (గర్భధారణకు ముందు, ప్రసవపూర్వ నిర్ధారణ పద్ధతులు, లింగ ఎంపిక నిషేధ చట్టం) అమలుపై క్వార్టర్లీ సమీక్ష సమావేశం మంగళవారం మధ్యాహ్నం 3 గంటలకు ఐడిఓసి వద్ద ఉన్న డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ డి. రామారావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ.. జిల్లాలో లింగ నిష్పత్తి తగ్గకుండా ఉండేందుకు పీసీపీఎన్‌డిటి చట్టాన్ని కచ్చితంగా అమలు చేయడం అత్యంత అవసరమని అన్నారు. ఆడ శిశు గర్భస్రావాలు, లింగ నిర్ధారణ వంటి చట్టవిరుద్ధ చర్యలపై కఠిన నిఘా అవసరమని పేర్కొన్నారు. చట్టాన్ని ఉల్లంఘించే వ్యక్తులు, సంస్థలపై ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్ష ఉండదని హెచ్చరించారు. ఫీల్డ్ స్థాయిలో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు మరింత అప్రమత్తంగా ఉండి అనుమానాస్పద ఘటనలను వెంటనే అధికారులకు తెలియజేయాలని సూచించారు. సేవ్ గర్ల్ చైల్డ్ పై అవగాహన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని డిపిఆర్‌ఓ గౌస్‌కు సూచించారు. జిల్లాలో మొత్తం 108 అల్ట్రాసౌండ్ కేంద్రాలు ఉన్నాయని, రీన్యువల్స్, ఇతర సేవల కోసం వచ్చిన 14 దరఖాస్తులను పరిశీలించి ఆమోదం కోసం కలెక్టర్‌కు పంపించాలని నిర్ణయించారు. అర్హత కలిగిన రేడియాలజిస్ట్, గైనకాలజిస్ట్ మాత్రమే స్కాన్ కేంద్రాలను నిర్వహించాలనీ, ఫారం-ఎఫ్ నిర్వహణ తప్పనిసరి అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య సేవల సమన్వయ అధికారి డాక్టర్ రాజశేఖర్, ఎంసిహెచ్ ప్రోగ్రాం అధికారి అదనపు డీఎంహెచ్‌ఓ డాక్టర్ చందు నాయక్, పీడియాట్రిక్స్ విభాగాధిపతి డాక్టర్ బాబురత్నాకర్, డిపిఆర్‌ఓ గౌస్ పాషా, డిసిపిఓ విష్ణుందన, జాగృతి ఎన్జీవో ప్రతినిధి కుముదిని, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ అధ్యక్షురాలు డాక్టర్ రహీనా బేగంలు పాల్గొన్నారు.

# ఖమ్మం రగ్బీ రంగంలో సంచలనం

## - తెలంగాణ మినీ సబ్ జూనియర్ అండర్-12 విభాగంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ రగ్బీ టోర్నమెంట్ లో "ఖమ్మం ఓరల్ ఛాంపియన్‌షిప్"
## - ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామినేని తిరుపయ్య చౌదరి, కార్యదర్శి రఘు నాయక్
## - ఇంటర్ స్కూల్ టోర్నమెంట్ ఘన విజయం
## - ఉత్సాహంగా సాగిన అండర్-12 పోటీలు ప్రతిభ చాటిన ఖమ్మం విద్యార్థులు



**ఖమ్మం ప్రతినిధి, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తెలంగాణ మినీ సబ్ జూనియర్ అండర్-12 విభాగంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ రగ్బీ టోర్నమెంట్ "ఖమ్మం ఓరల్ ఛాంపియన్‌షిప్" సాధించిందని ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ అధ్యక్షుడు స్వామినేని తిరుపయ్య చౌదరి, కార్యదర్శి రఘు నాయక్ లు అన్నారు. హైదరాబాద్ లో తెలంగాణ మినీ సబ్ జూనియర్ అండర్-12 విభాగంలో నిర్వహించిన ఇంటర్ స్కూల్ రగ్బీ ఒక్క రోజు టోర్నమెంట్ సోమవారం విజయవంతంగా ముగిసింది. జిల్లాలోని పలు పాఠశాలల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తమ ప్రతిభను ప్రదర్శించారు. ఖమ్మం జిల్లా రగ్బీ అసోసియేషన్ ఆధ్వర్యంలో జట్లు హైదరాబాద్ పోటీల్లోనూ పాల్గొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... బాలికల విభాగంలో వైరా జట్టు విజేత ఖమ్మం జట్లు రన్నరప్ స్థానాల్లో నిలిచాయన్నారు. ఈ పోటీల్లో తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అండ్ జూనియర్ కాలేజీ వైరా బాలికలు-1 జట్టు విజేతగా నిలిచింది. తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అండ్ జూనియర్ కాలేజీ ఖమ్మం బాలికలు-2 జట్టు మొదటి రన్నరప్‌గా నిలవగా, రెండవ రన్నరప్‌గా కస్తూరిబాగాంధీ బాలికా విద్యాలయం ముదిగొండ, తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ స్కూల్స్ అండ్ జూనియర్ కాలేజీ ఖమ్మం బాలికలు-1 జట్లు నిలిచాయి. బాలుర విభాగంలో మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల విద్యాలయం వైరా జట్టు రెండవ రన్నరప్‌గా ప్రతిభ కనబర్చింది. ఈ సందర్భంగా విజేతలు, రన్నరప్ జట్లకు నిర్వాహకులు బహుమతులు అందజేసి అభినందించారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో శారీరక దారుఢ్యం, క్రమశిక్షణ, జట్టు భావన పెంపొందుతుందని పేర్కొన్నారు. స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించిన అండర్-12 ఖమ్మం రగ్బీ అసోసియేషన్ క్రీడాకారులందరికీ అభినందనలు తెలిపారు. ఈ విజయాలకు పునాది వేసిన పీఈటీలు, కోచ్‌లు అయిన వైరా నాగేంద్రమ్మ, ఖమ్మం త్రివేణి, సైదాబి, ప్రేమరాణి, ముదిగొండ పిల్లలమర్రి సునీత, వైరా భాస్కర్ లను ప్రత్యేకంగా అభినందించారు. వారి మార్గదర్శకత్వం వల్లే ఈ యువ క్రీడాకారులు విజయపథంలో దూసుకెళ్తున్నారని తెలిపారు.



# ఎస్సీ కార్పొరేషన్ ఆన్లైన్ దరఖాస్తుల గడువు పొడిగింపు

## - ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు
## - ఏప్రిల్ 8 వరకు ఆన్‌లైన్ నమోదు గడువు
## - ఎస్సీ యాక్షన్ ప్లాన్ పథకాలను అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి

**ఖమ్మం ప్రతినిధి, మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** షెడ్యూల్డ్ కులాల అభ్యర్థుల కోసం ఎస్సీ యాక్షన్ ప్లాన్ 2025-26 క్రింద బ్యాంకు లింకేజీతో ఆర్థిక మద్దతు, బ్యాంకు లింకేజీ లేని పథకాలను కల్పించేందుకు ఫేజ్-1, ఫేజ్-2లకు సంబంధించిన ఆన్‌లైన్ నమోదు గడువును ఏప్రిల్ 8 వరకు పొడిగించినట్లు ఎస్సి కార్పొరేషన్ ఇడి నవీన్ బాబు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు (tsobmms. cgg.gov.in) వెబ్ సైట్ ద్వారా ఏప్రిల్ 8 లోపు తప్పనిసరిగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని, నమోదు చేసుకున్న దరఖాస్తుకు సంబంధిత పత్రాలను జతచేసి ఎంపీడీఓ/ మునిసిపల్ కార్యాలయంలో సమర్పించాలని, గడువు లోగా సమర్పించని దరఖాస్తులు పరిగణలోనికి తీసుకోబడవని, ప్రభుత్వం అందిస్తున్న ఈ అవకాశాన్ని అర్హత గల ఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎస్సి కార్పొరేషన్ ఇడి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

# మనసున్న మారాజు శ్రీధర్ వర్మ అన్నకు జన్మదిన శుభాకాంక్షలు



**షాద్ నగర్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** యువత సమస్యలపై ధైర్యంగా నిలబడాలని, సిద్ధాంతం కోసం తెగించి పోరాడే తత్వం అలవర్చుకోవాలని పిలుపునిస్తూ ముందుకు సాగుతున్న యువ నేత మారాజు శ్రీధర్ వర్మ అన్న ప్రత్యేక గుర్తింపు పొందుతు న్నారు. న్యాయం కోసం నిలబడే యువతే సమాజాన్ని మార్చగలదని విశ్వసిస్తూ, యువశక్తిని నవ సమాజ నిర్మాణానికి మార్గదర్శకంగా తీర్చిదిద్దాలని ఆయన సందేశం ఇస్తున్నారు. బీసీ సమాజం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలనే దృఢ సంకల్పంతో నిరంతరం కృషి చేస్తూ... యువతలో చైతన్యం రగిలించే నాయకుడిగా నిలుస్తున్నారు. సమాజ సేవనే లక్ష్యంగా పెట్టుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతూ...యువతకు స్ఫూర్తిగా మారారు. తన సంపాదనలో అధిక భాగాన్ని సేవా కార్యక్రమాలకు వినియో గిస్తూ మానవత్వాన్ని చాటుతున్న శ్రీధర్ వర్మ అన్న, అవసరంలో ఉన్నవారికి అండగా నిలుస్తూ సామాజిక బాధ్యతను ప్రతిబింబిస్తున్నారు. అందరినీ ఆత్మీయంగా పలకరిస్తూ నిస్వార్థ సేవకుడిగా ఎన్నో సేవలు అందిస్తున్నారు. యువతలో సేవాభా వాన్ని పెంపొందించేందుకు పలు కార్యక్రమాలు నిర్వహిస్తూ మార్గదర్శకుడిగా నిలుస్తున్నారు. సామాజిక స్పృహతో, చురుకైన నాయకత్వంతో తెలంగాణ ముదిరాజ్ పోరాట సమితి అధికార ప్రతినిధిగా గుర్తింపు పొందిన ఆయన, సమాజ హక్కుల కోసం కట్టుబడి పనిచేస్తున్నారు. ప్రత్యక్ష దైవం సూర్య భగవానుడి ఆశీస్సులతో భవిష్యత్తులో మరింత ఉన్నత స్థాయికి ఎదిగి, రాజకీయ రంగంలోనూ విశేష సేవలు అందించాలని ఆకాంక్షి స్తూ.. శ్రీధర్ వర్మ అన్నకు హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు.

# హెచ్.సి.ఏ కార్యదర్శిగా ఎన్నికైన జీవన్ రెడ్డిని సన్మానించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



**షాద్ నగర్,మార్చి 31 (పిసిడబ్ల్యూ న్యూస్) :** హైద్రాబాద్ క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎన్నికైన మన్నే జీవన్ రెడ్డి ని షాద్ నగర్ ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ చైర్మన్ వీర్లపల్లి శంకర్ సన్మానించారు. హైదరాబాద్ క్రికెటర్ అసోసియేషన్ కార్యదర్శిగా ఎంపిక పట్ల ఆనందం వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

# శర్వా 'బైకర్'కు సెన్సార్ పూర్తి...

## ఏప్రిల్ 3న గ్రాండ్ రిలీజ్



యంగ్ హీరో శర్వానంద్ ప్రధాన పాత్రలో నటిస్తున్న హై-ఆక్టేన్ స్పోర్ట్స్ ఫ్యామిలీ డ్రామా 'బైకర్' విడుదలకు సిద్ధమైంది. తాజాగా ఈ చిత్రం సెన్సార్ బోర్డు నుంచి యూ/ఏ (ఖ/సూ) సర్టిఫికెట్ పొందింది. దీంతో సినిమా విడుదలకు అన్ని అడ్డంకులూ తొలగిపోయాయి. ఈ చిత్రాన్ని ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల చేయనున్నట్లు చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది.
ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మించిన ఈ సినిమాకు అభిలాష్ రెడ్డి కంకర దర్శకత్వం వహించారు. తమిళనాడులో ఈ చిత్రాన్ని థింక్ స్టూడియోస్ విడుదల చేస్తోంది. "ఇక అతడిని ఆపడం ఎవరి తరమూ కాదు" అనే క్యాప్షన్‌తో రిలీజ్ పోస్టర్‌ను విడుదల చేసి, విడుదల తేదీని ఖరారు చేసింది.
ఈ సినిమాలో సీనియర్ నటుడు రాజశేఖర్ 'బుల్లెట్' సునీల్ అనే కీలకమైన పాత్రలో కనిపించనున్నారు. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ వీడియోలో, భారత రేసర్లు ఓడిపోవడానికి పుట్టలేదని నిరూపించాలనే తపన ఉన్న మాజీ మోటోక్రాస్ రేసర్‌గా రాజశేఖర్ పాత్ర ఆకట్టుకుంది. ఆయన కెరీర్‌లో 18 ఇండియన్ ఛాంపియన్‌షిప్‌లు, 57 సౌత్ జోన్ టైటిల్స్ గెలిచినట్టు చూపించారు.
'బైకర్' చిత్రంలో శర్వానంద్ సరసన మాళవిక నాయర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, బ్రహ్మాజీ, అతుల్ కులకర్ణి ఇతర ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. డేరింగ్ బైక్ రేసర్‌గా కనిపించడం కోసం శర్వానంద్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. ఈ చిత్రానికి జిబ్రాన్ సంగీతం అందిస్తుండగా, జె. యువరాజ్ సినిమాటోగ్రఫీ బాధ్యతలు చేపట్టారు. భారీ అంచనాల మధ్య ఈ స్పోర్ట్స్ డ్రామా ప్రేక్షకులను అలరించడానికి సిద్ధమవుతోంది.

# అందుకే వారిని పట్టించుకోవడం మానేశా



మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక ముద్ర వేసుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఆమె 'పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్' బ్యానర్‌పై సంగీత్ శోభన్, నయన్ సారిక జంటగా నటించిన చిత్రం 'రాకాస'. మానస శర్మ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా ఏప్రిల్ 3న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన ప్రీ-రిలీజ్ ఈవెంట్‌లో నిహారిక తనపై వస్తున్న విమర్శలకు ఘాటుగా సమాధానమిచ్చారు.
నిర్మాతగా కెరీర్ ప్రారంభించినప్పటి నుండి తనపై ఎన్నో విమర్శలు వస్తున్నాయని నిహారిక ఆవేదన వ్యక్తం చేశారు. "నేను ఏం చేసినా తప్పు పట్టేవాళ్లు ఉంటూనే ఉంటారు. 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో 11 మంది కొత్తవాళ్లను పరిచయం చేసినప్పుడు.. ఎందుకు ఇదంతా? తెలిసిన వాళ్లతో సినిమాలు చేయొచ్చు కదా అన్నారు. ఇప్పుడు 'రాకాస' వంటి హై-వోల్టేజ్ వీఎఫ్ఎక్స్ సినిమా చేస్తుంటే... మళ్లీ చిన్న కథలే చేయొచ్చు కదా అని సలహాలు ఇస్తున్నారు. నేనేం చేసినా మాటలు అనేవాళ్లు అంటూనే ఉంటారు, అందుకే వారిని పట్టించుకోవడం మానేశాను" అని ఆమె తెలిపారు.నిర్మాతగా ప్రతి సినిమా తనకు ఒక పాఠమని, నిరంతరం నేర్చుకుంటూనే ఉంటానని నిహారిక తెలిపారు. "నాకు కొణిదెల కుటుంబం ఎంత ముఖ్యమో, నా 'పింక్ ఎలిఫెంట్' టీమ్ కూడా అంతే ముఖ్యం. నేను చేయాలనుకున్నది చేస్తూనే ఉంటాను" అని ధీమా వ్యక్తం చేశారు.

# అందరినీ అలరించే కథ

ఒజి, శ్రీ సీతా రాముల కల్యా ణం చూత ము రారండి, అన్న య్య, ప్రేమ కోసం, శివ రామరాజు లాంటి బ్లాక్ బస్టర్ సినిమాలతో అలరించిన హీరో వెంకట్ సినిమాల్లోకి కమ్ బ్యాక్ ఇస్తున్నారు. విఆర్ ఎంటర్‌టైన్‌మెంట్స్ బ్యానర్ లో వెంకట్ హీరోగా రూపొందుతున్న మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్ 'హరుడు'. రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహిస్తున్నారు. తాజాగా మేకర్స్ సినిమా రిలీజ్ డేట్ ప్రకటించారు. సమ్మర్ స్పెషల్ గా మే 8న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. "ఇది పూర్తిగా మాస్ కమర్షియల్ ఎంటర్ టైనర్. ప్రేక్షకులు కోరుకునే అన్ని ఎలిమెంట్స్ ఇందులో వుంటాయి. ఇది అన్ని వర్గాల ప్రేక్షకులని అలరించే కథ. వెంకట్‌కి ఇది మంచి కమ్ బ్యాక్ మూవీ అవుతుంది"అని చిత్ర నిర్మాతలు తెలియజేశారు. ఈ చిత్రంలో హెబ్బాపటేల్, సలోని, నాటషా, అలీ, సుమన్,రవి వర్మ, సుభాశ్రీ కీలక పాత్రలు పోషిస్తున్నారు.




# అనుష్క 'కథనార్' ట్రైలర్ వచ్చేసింది..

## హాలీవుడ్ స్థాయిలో ఫాంటసీ హారర్ థ్రిల్లర్!

స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి ప్రధాన పాత్రలో నటిస్తున్న పాన్ ఇండియా చిత్రం 'కథనార్' ట్రైలర్ విడుదలైంది. మలయాళంలో భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ పీరియాడిక్ ఫాంటసీ హారర్ థ్రిల్లర్ ట్రైలర్, ప్రేక్షకులలో సినిమాపై అంచనాలను అమాంతం పెంచేసింది. హాలీవుడ్ స్థాయి విజువల్స్, ఉత్కంఠభరితమైన సన్నివేశాలతో ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో విశేష స్పందన దక్కించుకుంటోంది.
రోజిన్ థామస్ దర్శకత్వంలో శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇందులో జయసూర్య, ప్రభుదేవా, వినీత్ వంటి ప్రముఖ నటులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. 13వ శతాబ్దం నాటి కథాంశంతో రూపొందుతున్న ఈ సినిమాలో అనుష్క పాత్ర ఎంతో గంభీరంగా, మిస్టరీతో కూడుకుని ఉన్నట్లు ట్రైలర్ చూస్తే అర్థమవుతోంది. పీరియాడిక్ సెట్టింగ్స్, వీఎఫ్ఎక్స్ సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయి. మలయాళంతో పాటు తెలుగు, తమిళం, హిందీ, కన్నడ భాషల్లో ఈ సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు.
'బాహుబలి' తర్వాత సరైన విజయం కోసం ఎదురుచూస్తున్న అనుష్కకు ఈ సినిమా ఎంతో కీలకంగా మారింది. ఇటీవల ఆమె నటించిన 'ఘాటీ' ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. ఈ నేపథ్యంలో 'కథనార్' చిత్రంలో అనుష్క పోషిస్తున్న శక్తిమంతమైన పాత్ర ఆమె కెరీర్‌కు మళ్లీ ఊపునిస్తుందని అభిమానులు గట్టి నమ్మకంతో ఉన్నారు. ఈ సినిమాతో స్వీటీ బలంగా కంబ్యాక్ ఇస్తుందని ఫ్యాన్స్ ఆశిస్తున్నారు.






# సల్మాన్ సరసన నయన్..

## వంశీ పైడిపల్లి సినిమాలో అధికారిక ప్రకటన

బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, టాలీవుడ్ దర్శకుడు వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో రాబోతున్న భారీ చిత్రంపై ఓ కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో హీరోయిన్‌గా లేడీ సూపర్ స్టార్ నయనతారను ఖరారు చేసినట్లు చిత్ర బృందం అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రకటనతో సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి.టాలీవుడ్ ప్రముఖ నిర్మాణ సంస్థ శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ (ఎస్‌వీసీ) బ్యానర్‌పై అగ్ర నిర్మాతలు దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇది వారి 63వ చిత్రం  ఈ ప్రాజెక్ట్‌లోకి నయనతారకు స్వాగతం పలకడం గౌరవంగా భావిస్తున్నామని, 'ది క్వీన్' అడుగుపెట్టిందని నిర్మాణ సంస్థ సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది.ఇప్పటికే నయనతార బాలీవుడ్‌లో షారుఖ్ ఖాన్ సరసన 'జవాన్' చిత్రంలో నటించి భారీ బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్నారు. ఆ సినిమాతో ఉత్తరాది ప్రేక్షకులను సైతం మెప్పించిన ఆమె, ఇప్పుడు మరో అగ్ర కథానాయకుడు సల్మాన్ ఖాన్‌తో జతకట్టడం సినీ వర్గాల్లో ఆసక్తికరంగా మారింది. తెలుగు దర్శకుడు, టాలీవుడ్ అగ్ర నిర్మాణ సంస్థ కలిసి చేస్తున్న ఈ పాన్-ఇండియా ప్రాజెక్ట్‌పై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



# పొరపాటున అలా మాట్లాడాను..

## 'పెద్ది' టీమ్‌కు ఎస్‌కేఎన్ క్షమాపణ





మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటిస్తున్న 'పెద్ది' సినిమా బృందానికి ప్రముఖ నిర్మాత ఎస్‌కేఎన్ బహిరంగంగా క్షమాపణలు తెలిపారు. 'పెద్ది' విడుదల వాయిదా పడిందంటూ తాను చేసిన వ్యాఖ్యలు పొరపాటని, వాటిని వెనక్కి తీసుకుంటున్నట్లు ఓ వీడియో ద్వారా స్పష్టం చేశారు.
అసలేం జరిగిందంటే.. ఎస్‌కేఎన్ తన సొంత నిర్మాణ సంస్థలో వస్తున్న 'చెన్నై లవ్ స్టోరీ' సినిమా విడుదల తేదీని ప్రకటించే క్రమంలో నిన్న రాత్రి 'పెద్ది' గురించి మాట్లాడారు. ఏ పెద్ద సినిమా విడుదలయ్యే తేదీలో తమ చిత్రాన్ని తీసుకురావొద్దనే ఉద్దేశంతోనే తాను అలా వ్యాఖ్యానించానని, కానీ అది పొరపాటుగా దొర్లిందని వివరించారు.
ఈ సందర్భంగా 'పెద్ది' సినిమా గురించి ఆయన సానుకూలంగా మాట్లాడారు. ఆ చిత్రం అనుకున్న సమయానికే విడుదలై ఘన విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. నిర్మాత ఎస్‌కేఎన్ తాజా వివరణతో ఈ అంశంపై నెలకొన్న గందరగోళానికి తెరపడినట్లయింది.